RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 14 ఏప్రిల్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:265

## జనాభా ఆధారంగా సీట్లు పెంచొద్దు

## కేంద్రానికి రేవంత్ వినతి




హైదరాబాద్, ఏప్రిల్ 13

జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఆయన ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని ఆయన పేర్కొన్నారు. కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు.లోక్ సభ సీట్ల పెంపు విషయంపై అఖిల పక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. లోక్ సభ సీట్ల పెంపు, మహిళా రిజర్వేన్లు వేర్వేరనేది ప్రతి పౌరుడికి తెలుసని అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు.దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు ఈ విధానం అన్యాయం చేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పార్టీకైనా జాతీయ ప్రయోజనాలే ముఖ్యంగా ఉండాలని అన్నారు. జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధి పథంలో నడుస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గడం వల్ల దేశ సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కేవలం జనాభా నిష్పత్తిని మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలించాలని ఆయన సూచించారు. దేశ ప్రయోజనాలు పార్టీ ప్రయోజనాల కంటే మిన్న అని, ఏకపక్ష నిర్ణయాలు కాకుండా జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాలని కోరారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరిగి, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గితే అది దీర్ఘకాలంలో దేశ సమగ్రతకు ముప్పుగా మారుతుందని రేవంత్ రెడ్డి తన లేఖలో విశ్లేషించారు. లోక్‌సభలో ప్రస్తుతమున్న ప్రాంతీయ సమతుల్యతను కాపాడుతూనే మార్పులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ముందడుగు వేయాలని ప్రధానిని కోరారు.లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం మేర పెంచాలనే ప్రతిపాదనలపై స్పందిస్తూ, ఇది ఉత్తర మరియు దక్షిణాది రాష్ట్రాల మధ్య సీట్ల అంతరాన్ని మరింత పెంచుతుందని రేవంత్ రెడ్డి గణాంకాలతో వివరించారు. ఈ వివక్ష వల్ల దక్షిణాది రాష్ట్రాలు జాతీయ రాజకీయాల్లో అట్టడుగున పడిపోయే అవకాశం ఉందని, దీనిని నివారించడానికి పారదర్శకమైన విధానాన్ని అనుసరించాలని ఆయన డిమాండ్ చేశారు.లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం దామాషా పద్ధతి కాకుండా మరో విధానాన్ని అనుసరించాలని కోరారు. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో ఈ అంశంపై ముందుకు వెళ్లాలని సూచించారు.జనాభా నియంత్రణ పాటిస్తూ, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, కేవలం జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే రాజకీయంగా నష్టపోతాయనే ఆందోళన చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో, పనితీరు ఆధారిత కేటాయింపులు ఉండాలనేది సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనలోని ముఖ్య ఉద్దేశం. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గకుండా ఉంటుందని ఆయన వర్గం భావిస్తోంది.ఈ కొత్త ఫార్ములా ప్రకారం, తెలంగాణకు ప్రస్తుతమున్న 17 సీట్లకు అదనంగా 13 చేరి మొత్తం 30కి పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌కు కూడా 13 సీట్లు అదనంగా వచ్చి 38కి చేరుకుంటాయి. దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలైన తమిళనాడుకు 62, కర్ణాటకకు 49 సీట్లు దక్కనున్నాయి. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రకు 35 సీట్లు పెరిగి మొత్తం 83కి, జనాభా అధికంగా ఉండే ఉత్తరప్రదేశ్‌కు 29 సీట్లు పెరిగి 109కి చేరుకుంటాయి.మొత్తం మీద, ఈ ప్రతిపాదన అమలైతే కేంద్ర రాజకీయాల్లో ఆర్థికంగా బలమైన రాష్ట్రాల పాత్ర కీలకం కానుంది. జనాభా పెరుగుదలను ప్రోత్సహించే బదులు, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేలా రాష్ట్రాలను ముందుకు నడిపించడమే ఈ 'జీఎస్డీపీ ఫార్ములా' లక్ష్యంగా కనిపిస్తోంది.

## శ్రీపాదరావుకు సీఎం రేవంత్ నివాళి



హైదరాబాద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడు శ్రీపాదరావు ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అనేక పదవులకు వన్నె తెచ్చిన నాయకుడని కొనియాడారు. శాసనసభ ఔన్నత్యాన్ని పెంపొందిస్తూ సభను ఎంతో హుందాగా నడిపిన తీరు శ్లాఘనీయమని అన్నారు. శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తి అని ముఖ్యమంత్రి రు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

## ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్.. ఆదివాసీ, గిరిజన ,ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన కు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం పైన ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు. ఆదివాసీ, గిరిజన,ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పైన మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన,ఆదివాసీ ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతు ఆదివాసీ,గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాం ల నిర్మాణంపైన దృష్టి సారిస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు. వీటి ద్వారా తాగు, సాగు నీటి అవసరాలను తీర్చవచ్చునని ఆయన అన్నారు. చెక్ డ్యాం లు, రహదారుల నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు. ఆదివాసీ,గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వాలని చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల రహదారుల మరమ్మత్తులు ఆలస్యం అవుతాయని, కొన్ని చోట్ల కొత్త రహదారులకు అనుమతులు ఇవ్వడం లేదని వారు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా వీటిపైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంచే విషయాన్ని పరిశీలిస్తామని ఈ సందర్భంగా ఆయన వారికి హామీ ఇచ్చారు.ఐటీడీఏ లను మరింత బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి ఆదివాసీ, గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసిన వారిలో ఉన్నారు.

## భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

## చరిత్రాత్మక చట్టానికి ఏడాది పూర్తి



భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చింది.

ఈ రోజు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం రేపటితో ఏడాది పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.

ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజునముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించడం జరిగింది.

పోర్టల్ ప్రారంభించిన ఏడాది వ్యవధిలో 3.80 లక్షల పాస్ బుక్ లు జారీచేశాం.

పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించగా సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు.

భూ వివాదాలకు చరమగీతం పాడుతూ ఈ 12 నెలల కాలంలో పాత చిక్కుముడులను విప్పడంలో భూభారతి పోర్టల్ కీలక పాత్ర పోషించింది.

రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలు ఏప్రిల్ 2న 5 జిల్లాలోని 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. ఈ ఐదు మండలాల్లోని ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్ కేటాయించడం జరుగుతుంది.

రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఇప్పటికే ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించడం జరిగింది.

పాతసర్వే పద్దతులకు స్వస్తి పలుకుతూ ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి రోవర్లతో భూ సర్వే చేయనున్నాం. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు, త్వరలో మరో 400 కొనుగోలు చేయబోతున్నాం.

తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వేనెంబర్లు వినియోగంలో ఉండగా అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ సంఖ్య 2కోట్ల 29 లక్షలకు చేరింది.

భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి నాలుగునుంచి ఆరుగురు సర్వేయర్లను, రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది.

పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో ప్రజాప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తూ ప్రజలకు చేరువ చేస్తోంది.

## రాజకీయం చేయవద్దు




కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో స్పందించారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయవద్దని ఆయన కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని కోరారు. డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదని హామీ ఇచ్చారు. మేం కూడా దక్షిణాది రాష్ట్రంలోనే ఉన్నామని వ్యాఖ్యానించారు. ఇక్కడి రాష్ట్రాలకు తాము ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు.2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరుగుతుందని కిషన్ రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియకు రెండేళ్ల సమయం పడుతుందని తెలిపారు. కాబట్టి ఈ ప్రక్రియను ఎవరు కూడా రాజకీయం చేయవద్దని కోరారు.దక్షిణాది నుంచి ప్రస్తుతం కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రమంత్రులు అయ్యారని, డీలిమిటేషన్ జరిగితే చప్రాసీ పదవి కూడా రాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని, ఈ వ్యాఖ్యలపై మీరేం సమాధానం చెబుతారని కిషన్ రెడ్డిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు.దానికి కిషన్ రెడ్డి స్పందిస్తూ, రేవంత్ రెడ్డి వారానికి ఒకసారి ఢిల్లీకి వెళుతున్నారని, ఎందుకు అలా వెళుతున్నారో ఆయన సమాధానం చెప్పాలని నిలదీశారు. కానీ కాంగ్రెస్ పార్టీలో ఏ పదవి కావాలన్నా ఆయన ఢిల్లీకి డబ్బులు మోసుకెళుతున్నారని ఆరోపించారు. కానీ బీజేపీలో అలా ఉండదని అన్నారు. అందుకే ఆయన చప్రాసీ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.

## జగిత్యాల కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్ఎస్ ఏర్పాట్లు: నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను ప్రకటించిన కేటీఆర్



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు, ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జీలను ప్రకటించారు. ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ, ఈ, సభ విజయవంతం కోసం సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించింది.

ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేక ఇన్‌చార్జీలను కేటీఆర్ ఖరారు చేశారు.

నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలు:

జగిత్యాల: పల్లా రాజేశ్వర్ రెడ్డి (ఎమ్మెల్యే, జనగామ)

కోరుట్ల: వేముల ప్రశాంత్ రెడ్డి (మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బాల్కొండ)

ధర్మపురి: తక్కల్లపల్లి. రవీందర్ రావు (ఎంఎల్సీ)

వేములవాడ: బాల్క సుమన్ (మాజీ ఎమ్మెల్యే)

చొప్పదండి: పెద్ది సుదర్శన్ రెడ్డి (మాజీ ఎమ్మెల్యే)

సభకు వచ్చే జన సమీకరణ, ప్రాంగణ ఏర్పాట్లు మరియు నిర్వహణ బాధ్యతలను పార్టీ సీనియర్ నేతలు గాదరి బాలమల్లు మరియు మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించనున్నారు. వీరు క్షేత్రస్థాయిలో ఉండి సభ ముగిసే వరకు అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి జగిత్యాల సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## నేడు ఖమ్మం పర్యటనలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఖమ్మం

ఖమ్మం డీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్న పీసీసీ చీఫ్.

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,తుమ్మలనాగేశ్వరరావు పాల్గొంటారు..

రేపు అంబేద్కర్ జయంతి సందర్భంగా సహా పంక్తి భోజనం..జిల్లా కాంగ్రెస్ కమిటీ లో నూతనంగా TPCC అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ద్వారా ఎంపికైన జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులకు,ప్రధాన కార్యదర్శులకు, కోశాధికారి, అధికార ప్రతినిధులకు, కార్యదర్శులకు, ఎగ్జిక్యూటివ్ సభ్యులకు మనవి.

(మంగళవారం) న ఉదయం 10.00 గంటలకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకార మహోత్సం కలదులి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు , రెవెన్యూ ,గృహ నిర్మాణ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజ్యసభ సభ్యులు శ్రీమతి రేణుకా చౌదరి ,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి,శాసనసభసభ్యులుమాలోత్ రాందాస్ నాయక్0,మట్టారాగమయారు మరియు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు పాల్గొనెదరు

# ప్రజాబలం

14 ఏప్రిల్ 2026 మంగళవారం


## పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం...

అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమయ్యాయి. 21 గంటలపాటు జరిగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరలేదు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ జ్వాలలు తప్పవా..! ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తప్పదా..! నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయా..! అమెరికా– ఇరాన్ మధ్య చర్చల విఫలం ఎలాంటి పరిణామాలకు దారి తీయనుంది..అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో ప్రస్తుతం కుదిరిన రెండు వారాల తాత్కాలిక విరమణ ఒప్పందం ముగిసిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంది. ఇరాన్‌లోని చమురు కేంద్రాలతో పాటు.. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులకు అవకాశం ఉంది. ఒప్పందం కుదరకపోతే భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై భయాందోళనలు నెలకొన్నాయి.అమెరికా– ఇరాన్ దాడులకు ఇరాన్ కూడా అంతే గట్టిగా ప్రతిఘటిస్తుంది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవచ్చు. అదే జరిగితే.. సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ తదితర దేశాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలకు కూడా ముప్పు పొంచి ఉంది. ఈ యుద్ధం లెబనాన్, సిరియాలకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. టెహ్రాన్‌కు మద్దతుగా హూతీలు, హెజ్‌బొల్లాలు తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తాయి.హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టుబిగిస్తుంది. దీన్ని శాశ్వతంగా మూసివేస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని స్థాయికి చేరుకోవచ్చు. అనేక దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి కారణం కావొచ్చు.ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయొచ్చు. ఇప్పటివరకు పౌర అవసరాల కోసం మాత్రమే యురేనియంను శుద్ధి చేస్తున్నట్లు ఆ దేశం చెప్పుకొచ్చింది. ఈ ఉత్కంఠభరిత పరిస్థితుల మధ్య, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో షేర్ చేసిన ఒక వార్తా కథనం ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై పెను చర్చకు దారితీసింది. తమ నిబంధనలకు టెహ్రాన్ లొంగని పక్షంలో, ఇరాన్ నౌకలను సముద్ర మార్గంలోనే అడ్డుకునే 'నౌకాదళ దిగ్బంధనం' అస్త్రాన్ని ప్రయోగించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొందిఒకవేళ ఈ ప్లాన్ అమలైతే, ఇరాన్ నౌకలు రేవుల నుంచి ముందుకు వెళ్ళలేవు. దీనివల్ల ఆ దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న చమురు ఎగుమతులు పూర్తిగా ఆగిపోయి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. కేవలం ఇరాన్‌కే కాకుండా, ఆ దేశం నుండి పెద్ద ఎత్తున చమురును కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.గతంలో వెనిజులా మాజీ అధ్యక్షుడు మదురోను లొంగదీసుకోవడానికి అమెరికా ఇదే విధమైన నౌకాదళ దిగ్బంధనాన్ని అమలు చేసి విజయం సాధించింది. అదే తరహా వ్యూహాన్ని ఇప్పుడు ఇరాన్‌పై కూడా ట్రంప్ అమలు చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా అంచనా వేస్తోంది.

పాకిస్థాన్ వేదికగా ఇరాన్‌తో జరిగిన చర్చలు విఫలమైనట్లు అధికారికంగా ప్రకటించిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ పోస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది కేవలం మీడియా కథనం మాత్రమేనా లేక అమెరికా తదుపరి కార్యాచరణకు ఇది పరోక్ష సంకేతమా అని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ తన పోస్ట్ ద్వారా ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది.తాజా పరిణామాలతో అణుబాంబు తయారీ దిశగా అది అడుగులు వేయొచ్చు. ఆరోపణలపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. చైనా ఇరాన్‌కు ఆయుధాలు పంపడం మానుకోవాలని, లేకపోతే బీజింగ్‌కు 'వినాశకర పరిణామాలు' తప్పవని హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్య యుద్ధంలో చైనాకు 200% టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని గతంలోనే ప్రకటించిన ట్రంప్, ఈసారి మరింత కఠినంగా మాట్లాడారు. 'మాకు నాటో నుంచి ఎటువంటి సాయం లభించలేదు. అయినా ఇరాన్‌ను సైనికపరంగా ఓడించాం. చర్చలు విఫలమైనా అంతిమ విజయం మాదే,' అని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే, ఇరాన్ విద్యుత్ కేంద్రాలను 'తుడిచిపెట్టేస్తామని' ఆయన బహిరంగంగా హెచ్చరించారు.వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఈ ఆరోపణలను ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికి ఎటువంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొంది. అయితే, ఇరాన్ అధికారికంగా చైనా ఆయుధాలు అందినట్లు వెల్లడించకపోయినా, తమ వద్ద ఉన్న ఆధునిక వ్యవస్థల సామర్థ్యాన్ని బట్టి చూస్తే చైనా సాయం స్పష్టంగా కనిపిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చైనాకు ఇరాన్ నుంచి రోజుకు 20 లక్షల బ్యారెళ్ల ముడిచమురు సరఫరా అవుతోంది. ఈ ఆర్థిక బంధమే చైనా ఇరాన్‌కు రహస్య సాయం చేయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో కొత్త శక్తి సమీకరణాలకు దారితీస్తున్నాయి. చైనా?ఇరాన్ బంధం మరింత బలపడటం, ఆర్థిక, సైనిక సహకారం పెరగడం వల్ల అమెరికాకు ఇది సవాల్‌గా మారింది. నాటో దేశాలు ఈ యుద్ధంలో అమెరికాకు సాయం చేయకపోవడంతో అగ్రరాజ్యం ఒంటరిగా మారింది. హర్మూజ్ గుండా చమురు రవాణా ఆలస్యం కావడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది.చైనా ఆయుధ సరఫరా ఇరాన్‌కు ఊపిరి పోసింది. అమెరికా సైనికపరంగా విజయం సాధించినా, చర్చలు విఫలమవడం మరియు చైనా రహస్య సాయం యుద్ధాన్ని మరింత సంక్లిష్టం చేశాయి. ట్రంప్ హెచ్చరికలను చైనా లెక్కచేయకపోతే, అమెరికా?చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదరే ప్రమాదం ఉంది. హర్మూజ్ జలసంధి తెరవడం, ఇరాన్‌తో చర్చలు విజయవంతం కావడంపై మధ్యప్రాచ్య భవిష్యత్ ఆధారపడి ఉంది.పశ్చిమాసియా యుద్ధం మరింత విస్తరిస్తే.. అది భారత్‌కూ ఇబ్బందే. మన దేశ ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. చమురు, సహజవాయువు సరఫరాలకు అంతరాయం కలిగితే.. దేశ ఆర్థిక వ్యవస్థపై అది తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

## ఎయిర్ ఇండియా బంపర్ ఆఫర్

ముంబై, ఏప్రిల్ 13 నష్టాల్లో ఉన్న విమానయాన సంస్థ ఎయిరిండియాను లాభాల బాట పట్టించేందుకు టాటా గ్రూప్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ పురోభివృద్ధిలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ, వారిలో ఉత్సాహం నింపేందుకు 'పెర్ఫార్మెన్స్–లింక్డ్ స్టాక్ ఆప్షన్స్ (పీఎస్ఓపీ) పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. దీని ద్వారా ఉద్యోగుల ఉత్పాదకతను పెంచి, సంస్థ వృద్ధికి బాటలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.సోమవారం లైవ్‌మింట్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం ఈ కొత్త పథకానికి 'పీఎస్ఓపీ 2026' అని పేరు పెట్టారు. ఫిబ్రవరి 13న జరిగిన సర్వసభ్య సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ ప్లాన్ కింద పైలట్లు, ఇంజనీర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ సహా అర్హులైన ఉద్యోగులకు కంపెనీ స్టాక్ ఆప్షన్లు కేటాయిస్తారు. ఉద్యోగులు ఈ షేర్లను రూ.4 ముఖ విలువ నుంచి, కేటాయింపు సమయంలోని మార్కెట్ విలువ మధ్యలో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది."ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో ప్రస్తుతం, భవిష్యత్తులో పనిచేసే అర్హులైన ఉద్యోగుల పనితీరుకు ప్రతిఫలం ఇవ్వడం, సంస్థ వృద్ధికి, లాభదాయకతకు దోహదపడేలా వారిని ప్రేరేపించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రతిభావంతులను ఆకర్షించడం, నిలుపుకోవడం కూడా దీని లక్ష్యం" అని సమావేశ తీర్మానంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 6న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన వివరాల ప్రకారం ఈ పథకం కింద కంపెనీ మొత్తం షేర్ క్యాపిటల్‌లో 0.25 శాతానికి సమానమైన సుమారు 22.71 కోట్ల స్టాక్ ఆప్షన్లను కొత్త షేర్లుగా జారీ చేయనున్నారు.ఈ పథకంలో షేర్ల కేటాయింపునకు 1 నుంచి 5 సంవత్సరాల వెస్టింగ్ పీరియడ్ ఉంటుంది. అంటే ఉద్యోగులు దీర్ఘకాలం సంస్థతో కొనసాగేలా టాటా ప్రోత్సహిస్తోంది. అయితే, పనితీరు ఆధారంగానే షేర్ల కేటాయింపు ఉంటుంది. సంస్థ నిర్దేశించుకున్న అంతర్గత లక్ష్యాలలో 85 శాతం కంటే తక్కువ సాధిస్తే, ఉద్యోగులు కేవలం సగం షేర్లను మాత్రమే పొందే అవకాశం ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఎవరికి, ఎన్ని షేర్లు, ఏ ధరకు కేటాయించాలనేది నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీ నిర్ణయిస్తుంది.ఇప్పటికే దేశంలోని లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ అయిన ఇండిగో, స్పైస్‌జెట్, అలాగే ప్రైవేటు సంస్థ ఆకాశ ఎయిర్‌లలో ఇలాంటి ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకాలు అమల్లో ఉన్నాయి. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా గ్రూప్ కొనుగోలు చేసినప్పుడు కూడా దాదాపు 8,000 మంది ఉద్యోగులకు షేర్లను కేటాయించారు. ఇదిలా ఉంటే... ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మార్చి 30న తన పదవికి రాజీనామా చేసినా, కొత్త వ్యక్తి బాధ్యతలు చేపట్టే వరకు కొనసాగనున్నారు. ఈ నాయకత్వ మార్పు సమయంలోనే కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

### 14 న 12నుండి 4 గంటలకు మధ్య బయటకు వెళ్ళకండి

అమరావతి ఏప్రిల్ 13 రేపు రాయలసీమ, కోస్తా జిల్లాల్లో గరిష్ఠఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, ఏలూరు జిల్లాల్లో 33 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 44 మండలాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది. మ. 12 నుంచి సా.4 గంటల మధ్య బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించింది. ఈరోజు కడపలో గరిష్ఠంగా 44.4ఓజ ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది.

## హుస్నాబాద్ చెరువులను పరిశీలించిన మంత్రి పొన్నం



హుస్నాబాద్ పట్టణంలో కొత్త చెరువు , ఎల్లమ్మ చెరువు,పల్లె చెరువు అభివృద్ధి పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం నాడు పరిశీలించారు. పల్లె చెరువు కట్ట సుందరీకరణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణ డ్రైన్ వాటర్ కొత్త చెరువు లో కలవకుండా నేరుగా ప్రత్యేక ఫీడర్ కి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

మంత్రి మాట్లాడుతూ కొత్త చెరువు అభివృద్ధి పై పలు సూచనలు చేయడం జరిగింది. అనంతరం ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు పరిశీలించాను. కట్ట సుందరీకరణ డెవలప్మెంట్ జరుగుతున్న పనులపై ఆరా తీసి పనుల్లో నాణ్యత ఉండాలని ఆదేశించానునని అన్నారు.

చెరువులో నిర్మితమవుతున్న గ్లాస్ బ్రిడ్జి పనులు పరిశీలించి కట్టపై గ్రీనరీ లాన్, కట్టపైన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సూచించారు.గుట్టపైన ఉన్న గుట్టపై వ్యూ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో భక్తుల సదుపాయాల కోసం నిర్మిస్తున్న నూతన షెడ్డులను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో నూతనంగా నిర్మితమవుతున్న పోచమ్మ ఆలయాన్ని పరిశీలించారు. హుస్నాబాద్ 8,9 వ వార్డు కి సంబంధించి శ్మశాన వాటిక కు స్థల పరిశీలన చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారుజ మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ,మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్డీవో ,మున్సిపల్ కమిషనర్ ,ఇతర ముఖ్య నేతలు, అధికారులున్నారు.

## సింగూర్ ప్రాజెక్టు డ్యామ్ సేఫ్టీ పనులను పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ





సింగూరు ప్రాజెక్టు. ఆందోల్ నియోజకవర్గం. డ్యామ్ సేఫ్టీ పై ఇరిగేషన్ అధికారులు చేపట్టుతున్న పనుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి.

వచ్చే 50 ఏళ్లు సింగూరు ప్రాజెక్టు డ్యాం నిలిచేలా (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల మేరకు) నిర్మాణ పనులను చేపట్టాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

సింగూరు ప్రాజెక్టు డ్యాం బ్యూటిఫికేషన్ పై చర్చించారు.

సింగూర్ ప్రాజెక్టు సిలారపు రాజనర్సింహ కాలువ (ప్రధాన కాలువ) లైనింగ్ వర్క్స్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సింగూర్ ప్రాజెక్టులో ఉన్న ఐలాండ్ అభివృద్ధిపై టూరిజం అధికారులతో చర్చించారు.

ఐలాండ్ అభివృద్ధి, బోటింగ్, పార్కులు, గార్డెన్ బ్యూటిఫికేషన్, కాటేజిల నిర్మాణం, రెస్టారెంట్, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాట్లపై ఇరిగేషన్, టూరిజం అధికారులతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు.

సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

పనుల వేగవంతం పై అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారంపై చర్చించారు.

త్వరలో సింగూర్ డ్యాం సేఫ్టీ పనులతో పాటు టూరిజం అభివృద్ధి పై ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

పెద్దారెడ్డి పేట లిఫ్ట్ ఇరిగేషన్ వర్క్స్ పై సమీక్ష నిర్వహించారు.

ఆందోల్ పెద్ద చెరువు ట్యాంక్ బండ్ బ్యూటిఫికేషన్ తో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయడం పై సమీక్ష నిర్వహించారు.

అనంతరం, ఆందోల్ నియోజకవర్గం లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సింగూరు ప్రాజెక్టు వద్ద ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు.

గురుకుల పాఠశాల విద్యార్థులతో ఇంట్రాక్షన్ అయ్యారు.

విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల, స్పోర్ట్స్ ఫెసిలిటీస్ కల్పన కు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## సంగారెడ్డి బైపాస్ రోడ్ లో 5 చోట్ల జంక్షన్ లు ఏర్పాటు

## జంక్షన్ లు ఆకర్షణీయంగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చి దిద్దండి

### ఐబి జంక్షన్, ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ సర్కిల్ జంక్షన్ లో పర్యటించి HMDA అధికారులకు సూచనలు చేసిన జగ్గారెడ్డి





**సంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి ఏప్రిల్ 13 సంగారెడ్డి పట్టణం లోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం అవుతున్నాయి. రూ. 13 కోట్లతో చేపడుతున్న ఈ బై పాస్ రోడ్ లో ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు చేయాలని HMDA అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలో ఐబి గెస్ట్ హౌస్ మొదలుకుని బసవేశ్వర చౌక్ వరకు ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు కానున్నాయి. HMDA అధికారులతో కలిసి జంక్షన్ లు ఏర్పాటయ్యే ఐబి చౌరస్తా ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ చౌరస్తా ను పరిశీలించారు. జంక్షన్ లు ఏవిధంగా ఏర్పాటు చేయాలి, జంక్షన్ ల లో సుందరీకరణ పనులు చేయాలని, జంక్షన్ ల ను ఆకర్షణీయం గా తీర్చిదిద్దాలని HMDA అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచెలా జంక్షన్ ల డిజైన్ లు ఉండాలని కన్సల్టెన్సీ ప్రతినిధుల ను ఆదేశించారు. జంక్షన్ లు ఏర్పాటు విషయం లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూడాలని HMDA అధికారులకు సూచించారు. రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి కావాలని అధికారులకు జగ్గారెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ , HMDA ఇంజనీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఏక భారత్ స్ఫూర్తి - కొత్త ఏడాదిలో నూతన ఆకాంక్ష

## భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్






బైశాఖి, రొంగాలి బిహు, మహా బిషుబ పాన సంక్రాంతి, పొయిలా బైశాఖ్, విషు, తమిళ పుత్తాండు పర్వదినాల సందర్భంగా దేశ, విదేశాల్లో ఉన్నవారందరికీ సంప్రదాయ నూతన సంవత్సర ఆరంభ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పండగలన్నీ 'ఏక భారత్-శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ పవిత్ర వేడుకలు అందరి జీవితాల్లోనూ సంతోషాన్ని, సంక్షేమాన్ని నింపాలని ఆకాంక్షిస్తున్నాను.

చిత్తిరై మాసంలో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతారు. భూమిని సారవంతం చేసే పనులను ఆరంభిస్తారు. కష్టే ఫలి అనే సూత్రాన్ని మన దేశ ప్రజలు విశ్వసిస్తారు. అందుకే ఈ పనుల ప్రారంభాన్ని గొప్ప వేడుకలా నిర్వహిస్తారు. భారత్‌లో ఐక్యతకు, ఉమ్మడి సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఇలాంటి ఉత్సవాలను దేశవ్యాప్తంగా జరుపుకొంటారు.

ఉత్తర భారత దేశంలో, ముఖ్యంగా పంజాబ్ ప్రజలు బైశాఖిని వ్యవసాయ పండగగా జరుపుకొంటారు. దక్షిణాదిన కేరళలో విషు నిర్వహిస్తారు. ఇక్కడ మొదటగా.. పవిత్రమైన వస్తువులను (కణి) తిలకించడం ఆచారంగా వస్తోంది. అస్సాం ప్రజలు బిహును, పశ్చిమ బెంగాల్ ప్రజలు పొయిలా బైషాఖ్‌ను ఉత్సాహంగా జరుపుకొంటారు.

ఈ సమయంలోనే మణిపూర్, త్రిపుర, ఒడిశా, బీహార్, ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో నూతన సంవత్సర ఆరంభాన్ని వివిధ సంప్రదాయ రూపాల్లో ఉత్సాహంగా నిర్వహిస్తారు. ఈ శుభ సందర్భంగా గంగానదిలో పవిత్ర స్నానం ఆచరించేదుకు దేశం నలుమూలల నుంచి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు.

ఇటీవలే తెలుగు ప్రజలు నూతన సంవత్సరాన్ని ఉగాదిగా జరుపుకోగా, మరాఠీ, కొంకణి సమాజాలు గుడి పడ్వాగా నిర్వహించుకున్నాయి.

మనం అత్యంత ప్రాచీన నాగరికతకు చెందిన నాళ్లం. మన పూర్వీకులకున్న శాస్త్రీయ పరిజ్ఞానమే దీనికి నిదర్శనం. విశ్వం గురించి వారికున్న గొప్ప అవగాహన మన నూతన సంవత్సర వేడుకల్లో ప్రతిబింబిస్తుంది.

మన పూర్వీకుల జ్ఞానాన్ని వేడుకగా నిర్వహించుకొనే ఒక అద్భుతమైన సందర్భమే ఈ తమిళ నూతన సంవత్సరాది. ఇది సంప్రదాయం, కుటుంబం, ఆధ్యాత్మికత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని ఒక్క చోట చేర్చే పండగ. ఇది అనుభవాల మార్గదర్శకత్వంతో కొత్త ఆశలతో ముందుకు సాగేలా ప్రోత్సహిస్తూ నూతన ఆరంభానికి నాంది పలుకుతుంది.

ఇప్పుడు మనం అంతర్జాతీయ క్యాలెండర్‌ను అనుసరిస్తున్నటికీ.. మన తమిళ క్యాలెండర్‌ను కూడా కచ్చితంగా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే ఇది రోజులు, నెలలకు మాత్రమే కాదు.. సంవత్సరాలకు కూడా ప్రత్యేకమైన పేర్లు కేటాయించింది. సంవత్సరాలకు మొత్తం 60 పేర్లు ఉండగా.. అందులో "పరాభవ" అని పిలిచే ఈ ఏడాది 40వది.

"ఆస్ట్రానమీ" అనే పదం గ్రీకు భాషకు చెందినది. అంటే నక్షత్ర నియమాలను అధ్యయనం చేయడం అని అర్థం. తమిళంలో దీనిని 'వాణీయల్' అని పిలుస్తారు. వేల ఏళ్ల క్రితమే, తమిళ పండితులు ఈ భూమి గుండ్రంగా ఉందని అర్థం చేసుకొని, ఖగోళ వస్తువుల కదలికను, వాటి ప్రభావాన్ని అధ్యయనం చేశారు.

ఈ విశ్వ స్వభావం, గమనం గురించి 'పదిట్రుపత్తు' లాంటి తమిళ సాహిత్య గ్రంథాలు వివరిస్తాయి. ఈ ప్రపంచం పంచభూతాలతో ఎలా ఏర్పడిందో.. ఖగోళ శక్తులు దానిని ఎలా నడిపిస్తున్నాయో శ్లోకాలు వివరిస్తాయి. 'సిరుపాణాట్రుప్పడై' వంటి ఇతర రచనలు గ్రహాల గమనాన్ని తెలియజేస్తాయి.

గ్రహాలు, నక్షత్రాలకు సంబంధించిన ప్రస్తావన సంగం సాహిత్యంలో కూడా కనిపిస్తుంది. పురనానూరులో శనిని నల్లని గ్రహం (మైమ్మీన్)గా వర్ణించారు. ఖగోళ ప్రభావాలను అధ్యయనం చేసేవారిని "కణియన్" గా పిలిచేవారు. ఈ సంప్రదాయం నుంచే కవి కణియన్ పూంగుండ్రనార్ తన పేరును తీసుకున్నారని విశ్వసిస్తారు.

ఇలాంటి విద్యావేత్తలను 'తొల్కాప్పియం' లాంటి ప్రాచీన గ్రంథాలు 'అరివర్' గా పిలిచాయి. వివాహాది శుభకార్యాలను సరైన తేదీలు, సమయాలు ఎంచుకొని నిర్వహించేవారని 'అకనానూరు' లాంటి సాహిత్య గ్రంథాలు తెలియజేస్తున్నాయి.

ఇప్పటికీ తమిళనాడులో ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. చిత్తిరై మాసంలో మొదటి రోజున ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేస్తారు. పంచాంగంలో అయిదు అంశాలుంటాయి: వారం, తిథి, కరణం, నక్షత్రం, యోగం. వీటి ఆధారంగా.. ఈ ఏడాదిలో వర్షపాతం, వ్యవసాయం, తదితర అంశాల గురించి అంచనా వేస్తారు.

సమయాన్ని లెక్కించేందుకు మన పూర్వీకులు సౌర, చంద్రమానాలను ఉపయోగించారు. అధునాతన పరికరాలను ఉపయోగించి గ్రహణాలను ఆధునిక శాస్త్రం లెక్కిస్తుంటే... పూర్వకాలంలో వీటిని గణించి కచ్చితంగా అంచనా వేసేవారు.మన పూర్వీకులు మనకు వారసత్వంగా విజ్ఞానాన్ని అందించారు. దానిని మనం పరిరక్షించి.. భవిష్యత్తు తరాలకు అందించాలి. ఈ సంప్రదాయాన్ని గౌరవించే ఓ మార్గమే దేవాలయాల్లో పంచాంగ శ్రవణం.

ప్రకృతి మనకు సమృద్ధిగా అందించిన వనరులకు మనం ఇచ్చే గౌరవాన్ని సంవత్సరాది ప్రతిబింబిస్తుంది. పండ్లు, పుష్పాలు లాంటి శుభప్రదమైన వస్తువులతో ఉదయాన్నే ఇళ్లను అలంకరిస్తారు.

ప్రకృతి తనను తాను పునరుజ్జీవింప చేసుకొనే సమయమే వసంతం. ఈ సమయంలో చెట్లు, మొక్కలు పచ్చగా మారతాయి. పూలు వికసిస్తాయి. పండ్లు కాస్తాయి. ప్రకృతితో మమేకమై జీవించే తమిళులు.. ప్రకృతి సమృద్ధిగా ప్రసాదించిన వాటిని 'కాణి కణల్' అనే ఆచారం ద్వారా వీక్షిస్తూ.. కొత్త ఏడాదిని ప్రారంభిస్తారు.

అలాగే, చేదుతో సహా అన్ని రకాల రుచులతో కూడిన సంప్రదాయ వంటకాన్ని సిద్ధం చేస్తారు. ఇది ఆనందం, బాధతో పాటు అన్ని రకాల అనుభవాలతో జీవితం నిండి ఉంటుందని, దానిని సమతుల భావనతో స్వీకరించాలని మనకు తెలియజేస్తుంది.

దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా భారతీయులు నివసిస్తున్న ప్రదేశాల్లో నిర్వహించుకొనే ఈ ఉత్సవాల్లో ఓ ఉమ్మడి భావన దాగి ఉంది. ఈ వేడుకలు మన సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని మనకు గుర్తు చేస్తూనే.. అంతర్లీనంగా ఉన్న ఐక్యతా భావాన్ని తెలియజేస్తాయి. సామరస్యంతో మనం కలసి జీవిస్తామనే ఆశాభావానికి ప్రతీకలుగా నిలుస్తాయి.

మన పూర్వీకులు మనకు నిర్దేశించిన మార్గాన్ని అనుసరిస్తూ.. సానుకూల దృక్పథం, విశ్వాసం అంకిత భావంతో ఈ కొత్త సంవత్సరాన్ని నిర్వహించుకోవాలని యువతను కోరుతున్నాను. దేశ పురోగతికి సహకారం అందించేలా చిత్తశుద్ధితో మన ప్రయత్నాలను ప్రారంభిద్దాం. నాగరికతా స్ఫూర్తితో మన భారతదేశం ఎల్లప్పుడూ ఐకమత్యంగానే ఉంది. ఇకపై కూడా దానినే కొనసాగిస్తుంది. మన పూర్వీకుల ఆశీస్సులతో ఏక భారత్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగి, 2047 నాటికి శ్రేష్ఠ భారత్‌ను, వికసిత భారత్‌ను నిర్మించడంలో విజయం సాధించుగాక!

## వికారాబాద్ జిల్లా ప్రజలకు అంబేద్కర్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన్నగారి కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ జిల్లా ప్రజలకు ఏప్రిల్ 14 బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మదిన సందర్భంగా వికారాబాద్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన్నగారి కొండల్ రెడ్డి, బాబాసాహెబ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గొప్ప జ్ఞాన పంపానుడు వెలిగే సూర్యుడు భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ అని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టరేట్ అవార్డు గ్రహీత సన్నగారి కొండల్ రెడ్డి వికారాబాద్ జిల్లా ప్రజలకు అంబేద్కర్ జన్మదిన సందర్భంగాశుభాకాంక్షలు తెలిపారు

## కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్ష విరమింపజేసిన రాజనాల




వరంగల్ ఏప్రిల్ 13 కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్ష విరమించే కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసి డెంట్ రాజనాల శ్రీహరి మాట్లాడుతూ ఏఐసీసీ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ పిలుపుమేరకు వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్ ఆధ్వర్యంలో గత పది రోజుల నుండి పోచమ్మ మైదాన్ సెంటర్లో రైతులకు కేంద్రం అన్యాయం చేస్తుందంటూ చేపట్టిన దీక్ష విరమణ కార్యక్రమకి గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం ఇక్కడ రైతులను మోసం చేస్తూ విదేశాలలో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ తక్షణమే చీకటి ఒప్పందాలు వెంటనే విరమించుకోవాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఆదరణలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాజనాల శ్రీహరి అన్నారు ఈ కార్యక్రమంలో వరంగల్ యువజన జిల్లా అధ్యక్షులు కొరవి రమేష్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దిలీప్ ~్యా.~. జ.+. ~ా సప్న. ఏలియా గౌడ్ తో పాటు నాయకులు వందమంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు....

## కీర్తన కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

కడప కాజీపేట అగ్రహారం విద్యార్థి కీర్తన కుటుంబాన్ని కడప ఎంపీ అవినాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురాంరెడ్డిలు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి ఆర్థిక సహాయం అందజేశారు.. కడప ఎంపీ అవినాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే రఘురాం రెడ్డి ఎదుట తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.

జరిగిన సంఘటనపై కీర్తన తల్లిదండ్రులను కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టి పల్లె రఘురాంరెడ్డి లు అడిగి తెలుసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే రఘురాం రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా చరిత్రలో ఎప్పుడు ఇటువంటి సంఘటన జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులో ఇటువంటి ఘాతుకం జరగడం దుర్మార్గం అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో వందల కేసులు ఇలాంటి వచ్చాయన్నారు. మైలవరంలో ఇటువంటి కేసులో ఆరు నెలల నుండి నిందితున్ని కనుగొనలేకున్నారు. వ్యవస్థలు ఏం చేస్తున్నాయన్నారు. నిందితులకు వ్యవస్థల మీద ప్రభుత్వం మీద భయం ఉంటే ఇలా చేయరన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో మూడు నాలుగు బెల్టు షాపులు ఉన్నాయన్నారు. మారకద్రవ్యాలు ప్రతి గ్రామంలో విచ్చలవిడిగా దొరుకుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారన్నారు. ఇంట్లో ఉంటేనే మహిళల గొంతు కోస్తున్నారంటే రక్షణ ఎక్కడుందన్నారు. ఇటువంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఎందుకు అలసత్వం వహిస్తోందన్నారు. ప్రభుత్వం మీద వ్యవస్థల మీద ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ బీహార్ ను మించిపోయే రాష్ట్రంగా తయారవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 1819 రోజులుగా నిత్యం కొనసాగుతున్న మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవలు








**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ ఏప్రిల్ -13** వేములవాడ పట్టణంలోని 1819 రోజులుగా అన్నదాన సేవలు కొనసాగుతున్నాయి సోమవారం రోజున ప్రతిరోజు దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సేవల ద్వారా భీమేశ్వర ఆలయం వద్ద లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ వద్ద, 50 మంది పేదలైన అన్నార్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమం పుట్టినరోజు రూపంగా శుభకార్యాల రూపంగా వివాహ మహోత్సవాల రూపంగా దాతలు ముందుకు వచ్చి సహకారం అందించినందుకు మై వేములవాడ ట్రస్ట్ వారు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## మాతృదేవోభవ,సంఘమిత్ర సంస్థలాఅద్వర్యం లో అన్నదాన మహాయజ్ఞం ప్రారంభం



మేడ్చల్(కీసర)ఏప్రిల్ 13 శ్రీ రామలింగేశ్వర కాలనీ, కుందనపల్లి కీసరి మాతృదేవోభవ సత్సంగ్ మరియు సంఘమిత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో సహస్ర అన్నదాన యజ్ఞం ప్రారంభమైంది.- మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక గౌరవాధ్యక్షులు ఈ కార్యక్రమానికి విచ్చేసి, ప్రతి శుక్రవారం సత్సంగ్ కార్యక్రమాలు ఘనంగా జరగాలని, అన్నదానం ఎంతో పవిత్రమైనదని ప్రశంసించారు.- అధ్యక్షురాలు డాక్టర్ శివలింగ నాగ విజయలక్ష్మి కీసరలో ఈ మహాయజ్ఞం ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు, దేశవ్యాప్తంగా అన్నదాన యజ్ఞం కొనసాగుతుందని తెలిపారు. మాతృప్రేమ ప్రచారం గురించి సమాజానికి తెలియజేస్తామన్నారు- ఈ కార్యక్రమంలో ఏకాదశి రుద్రాభిషేకం, కె.వి.ఎన్ శర్మ ఆధ్వర్యంలో జరిగింది. విజయ కనకదుర్గ, విజయ్, నాగభూషణం, అల్లాజి, వేణు పాల్గొన్నారు.

# ఉదయ్ నిధి టెంపుల్ రన్

చెన్నై, ఏప్రిల్ 13 సనాతన ధర్మాన్ని అంటువ్యాధులతో పోల్చి, దాన్ని పూర్తిగా నిర్మూలించాలంటూ గతంలో హిందూవ్యతిరేక వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి స్టాలిన్.. ఎన్నికల వేళ తన రాజకీయ జిమ్మిక్కును ప్రదర్శించారు. ఉదయనిధి రీసెంట్ గా ఓ ఆలయ సందర్శనకు వెళ్లారు. ఇది ఎన్నికల ముందుకావడంతో పక్కాగా రాజకీయ స్క్రిప్ట్ అని ప్రత్యర్థులు సైతం విమర్శించారు. అయితే టెంపుల్ కు వెళ్లిన ఉదయనిధి.. తాను చేసిన ఓ పనితో వివాదాన్ని రాజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయనిధి స్టాలిన్ ఒక ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అర్చకులు ఆయనకు తిలకం దిద్ది ఆశీర్వాదం ఇచ్చారు. అయితే, ఆలయం నుంచి బయటకు వచ్చిన వెంటనే ఆయన ఆ బొట్టును తుడిచివేశారని ఆరోపణలు రావడంతో హిందూ సంఘాలు, ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. 'సనాతన ధర్మం డెంగ్యూ, మలేరియా వంటిది' అని గతంలో వ్యాఖ్యానించిన నేత, ఇప్పుడు ఓట్ల కోసం ఆలయాలకు వెళ్లడం రాజకీయ కపటత్వమేనని విపక్షాలు విమర్శిస్తున్నాయి. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే ఉదయనిధి హిందూ భావోద్వేగాలతో ఆడుకుంటున్నారని బీజేపీ, ఇతర కూటమి పార్టీలు ఆరోపిస్తున్నాయి. డీఎంకే నేతలు ఓట్ల కోసం ఎంతకైనా దిగజారుతారని, భక్తి లేకపోయినా నటన చేస్తున్నారని దుయ్యబడుతున్నాయి. తమిళనాడులో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న తరుణంలో ఈ అంశం విపక్షాలకు ఒక బలమైన ఆయుధంగా మారింది. సనాతన ధర్మంపై గత వ్యాఖ్యలు ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చకు దారితీయగా, తాజా 'బొట్టు' వివాదం ఆ సెగను మరింత పెంచేలా కనిపిస్తోంది.

# మహిళా బిల్లుకు కౌంట్ డౌన్...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12, పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లుకు కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యింది. ఈ చట్ట సవరణ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. "నారీ శక్తి వందన్ అధినియం పేరుతో మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణలపై చర్చించేందుకు వీలుగా ఈ నెల 16 నుంచి 18 వరకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు కూడా నడుం బిగించింది. దీంతో బడ్జెట్ సమావేశాల కాలాన్ని కూడా పొడిగించింది. దీనిని బట్టి చూస్తే ఈ బిల్లు విషయంలో ఎన్డీయే ప్రభుత్వం గట్టి పట్టుదలతో వుందని అర్థమైపోతుంది. ఇక? ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత కీలక అడుగు వేశారు. 'మహిళా రిజర్వేషన్ల చట్టం' అమలులో మద్దతును కోరుతూ ప్రధాని మోదీ లోక్ సభ, రాజ్యసభలోని అన్ని పార్టీల సభా నాయకులకు లేఖ రాశారు. ఏప్రిల్ 16 నుంచి నారీశక్తి వందన్ అధినియం" కి సంబంధించిన చారిత్రాత్మకమైన చర్చ పార్లమెంట్ లో జరగనుంది. ఈ ప్రత్యేక సమావేశం ద్వారా మన దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఓ సువర్ణావకాశం.

అందరినీ కలుపుకుంటూ, సమిష్టిగా ముందుకు సాగాలన్న మన సంకల్పాన్ని పునరుద్ఘాటించే సందర్భం కూడా ఇదే. ఈ స్ఫూర్తి, ఉద్దేశంతోనే నేను మీకు లేఖ రాస్తున్నాను. ఈ చట్టం ఉద్దేశం, స్ఫూర్తి ఈ రెండింటిని పరిగణనలోకి తీసుకొని, ఈ బిల్లు సంపూర్ణంగా అమలులోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది" అంటూ మోదీ ఆ లేఖలో వివరించారు. అంతేకాకం?డా 2029 లోకసభ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు కావడం అత్యంత అవసరమని ప్రధాని నొక్కి చెప్పారు. విస్తృతమైన సంప్రదింపుల తర్వాత, దేశ వ్యాప్తంగా నారీశక్తి వందన్ అధినియం అమలు చేయడానికి తగిన సమయం ఆసన్నమైందని తాము ఓ నిర్ణయానికి వచ్చామని ప్రధాని ఆ లేఖలో పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు మరియు శాసనసభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్ల అమలుతోనే నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని వివరించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య సంస్థలకుకొత్త శక్తిని అందిస్తుందని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తుందన్నారు. తాము చేస్తున్న ఈ ప్రయత్నం పక్షపాత రాజకీయాలకు అతీతమైందని, ఓ ముందడుగు అని ప్రధాని అభివర్ణించారు. మహిళల కలలను సాకారం చే? దిశగా ఓ ప్రయత్నమని అభివర్ణించారు. ఉభయ సభల పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనకు, బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని ప్రధాని అన్ని పక్షాలను కోరారు. ఈ సవరణను ఆమోదించడానికి మనమందరం ఏకతాటిపైకి రావాలనే ఉద్దేశంతో నేను ఈ లేఖను రాస్తున్నానని, ఈ విషయంపై పార్లమెంటులో అనేకమంది పార్లమెంటు సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే ఎంతో బాగుంటుంది మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఏ ఒక్క పార్టీకో లేదా ఏ ఒక్క వ్యక్తికో సంబంధించింది కాదని, వీటన్నింటికీ అతీతమైన సందర్భం అని మోదీ అభిప్రాయపడ్డారు. మహిళల పట్ల, అలాగే మన భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను చాటిచెప్పాల్సిన సమయం ఇది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలనే ఆకాంక్షను అన్ని రాజకీయ పార్టీలూ ఎంతో కాలంగా వ్యక్తం చేస్తున్నందున, ఆ ఆశయాన్ని సాకారం చేయడానికి ఇదే సరైన సమయం," అని ప్రధాని వివరించారు. దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర పెంచడానికి రూపొందించినదే ఈ 'మహిళా రిజర్వేషన్ బిల్లు'. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం లోక్‌సభలో 542 సీట్లకు గాను.. 78 మంది మహిళా ఎంపీలుంటే.. రాజ్యసభలో 224 సీట్లలో 24 మంది మహిళలున్నారు. ఉభయసభల్లో మొత్తం 102 మంది మహిళా ఎంపీలున్నారు. ఈ లెక్కన చూస్తే.. పార్లమెంట్‌లో 13.3 శాతం మాత్రమే మహిళలున్నారు. ఈ సంఖ్యను 33 శాతానికి పెంచాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించారు. ఈ ఆలోచనకు దాదాపు 27 ఏళ్ల క్రితమే అంకురార్పణ జరిగింది. 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టింది. తర్వాత వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ప్రవేశపెట్టినా ఈ బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. చివరకు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఆపై 2014లో లోక్‌సభ రద్దు కావడంతో మరోసారి బిల్లు అడుగున పడిపోయింది.

మరలా తొమ్మిదేళ్ల అనంతరం తాజాగా మరోసారి ఈ బిల్లు తెరమీదకొచ్చింది.

# సౌదీకి భారీగా పాకిస్తాన్ యుద్ధవిమానాలు

దుబాయ్, ఏప్రిల్ 12, గత ఏడాది సెప్టెంబర్ లో పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కీలక రక్షణ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా పాకిస్థాన్ సుమారు 13 వేల మంది సైనికులు, 10 నుంచి 18 వరకు ఫైటర్ జెట్లను సౌదీ అరేబియాకు పంపించింది. ఈ బలగాలను సౌదీ తూర్పు సెక్టార్‌లోని కింగ్ అబ్దులజిజ్ ఎయిర్ బేస్‌లో మోహరించారు. పాకిస్థాన్ సైనిక బృందం, ఫైటర్ జెట్లు, సహాయక ఎయిర్‌క్రాఫ్ట్‌లు శనివారం సౌదీ ఎయిర్ బేస్‌లో ల్యాండ్ అయినట్లు సౌదీ అరేబియా రక్షణ శాఖ వెల్లడించింది. ఇరు దేశాల సైన్యం మధ్య సమన్వయాన్ని పెంపొందించడానికి, కార్యాచరణ సన్నద్ధతను మెరుగుపర్చడం, భద్రతను, స్థిరత్వాన్ని పటిష్టం చేయడమే లక్ష్యంగా ఈ మోహరింపు చేపట్టినట్లు సౌదీ రక్షణ శాఖ వెల్లడించింది. ఓవైపు పాకిస్థాన్ యుద్ధ విమానాలు సౌదీలో దిగిన సమయంలోనే.. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు ఇస్లామాబాద్ ఆతిథ్యం ఇవ్వడం గమనార్హం. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ఓవైపు యుద్ధానికి ముగింపు పలకడానికి ప్రయత్నిస్తూనే.. పాక్ తన మిత్రదేశమైన సౌదీకి సైన్యాన్ని పంపించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇస్లామాద్‌లో జరిగిన చర్చలు విఫలమైనట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆదివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ సైన్యాన్ని తమ దేశానికి పంపించిన విషయాన్ని సౌదీ అరేబియా తాజాగా ప్రకటించినప్పటికీ.. పాకిస్థాన్ గత నెలలోనే ఎయిర్‌క్రాఫ్ట్‌లు, సైన్యాన్ని సౌదీకి పంపినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్ క్షిపణి నిరోధక వ్యవస్థలను కూడా సౌదీకి పంపించినట్లు చెబుతున్నారు. "కనీసం 13 వేల మంది పాకిస్థాన్ సైనికులు, 10 నుంచి 18 ఫైటర్ జెట్లు సౌదీ అరేబియాలో ల్యాండ్ అయ్యాయి. ఇప్పటికే అక్కడ 10 వేల మంది సైనికులు ఉన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన రక్షణ ఒప్పందం ప్రకారం ఈ ఏర్పాటు జరిగింది" అని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు మహ్మా మెహదీ తెలిపారు. సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ గత ఏడాది రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు. నాటో తరహాలో ఉన్న ఈ ఒప్పందం ప్రకారం.. ఒక దేశంపై దాడి జరిగినా సరే.. దాన్ని రెండు దేశాలపై జరిగే దాడిగా పరిగణిస్తారు. పాకిస్థాన్ అణ్వస్త్ర దేశం కావడంతో.. ఈ ఒప్పందం ద్వారా సౌదీకి ప్రయోజనం చేకూరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముప్పు తీవ్రతను బట్టి పాకిస్థాన్ నుంచి అన్ని రకాల రక్షణ, సైనిక సాయాన్ని సౌదీ పొందే అవకాశం ఉంటుంది. 1960ల నుంచే పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య రక్షణ సంబంధాలు ఉన్నాయి. యెమెన్‌లో ఈజిప్టు యుద్ధం సమయంలో పాకిస్థాన్ తన బలగాలను సౌదీకి పంపించింది. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడ్డాయి. ప్రస్తుతం ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకున్నాయి. ఈ పరిస్థితుల్లో సౌదీ, పాక్ రక్షణ ఒప్పందం వైపు అందరి దృష్టి మళ్లింది.

# హస్తినకు చేరిన గ్రానైట్ కథ

ఖమ్మం, ఏప్రిల్ 13, గ్రానైట్‌కు ఖమ్మం తర్వాత తెలంగాణలో కరీంనగర్‌కు మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి గ్రానైట్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఈ వ్యాపారంగా విస్తరించింది. కరీంనగర్ గ్రానైట్‌కు మంచి డిమాండ్ ఉండడంతో చాలా మంది వ్యాపారులు ఈరంగంలోకి దిగారు. యూనియన్‌గా ఏర్పడి వ్యాపారం చేస్తున్నారు. అయితే అధికారుల అండతో ఈ వ్యాపారులు అక్రమ మైనింగ్, ఎగుమతులకు తెరలేపారు. దీనిపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గతంలోనే సీబీఐకి ఫిర్యాదు చేశారు. రూ.749 కోట్ల సీనరేజీ (రోయల్టీ) నిధుల ఎగవేతతోపాటు రూ.వేల కోట్ల విలువైన అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ కార్యాలయం పీఎంవో దృష్టి సారించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీబీఐ, ఎన్‌జీటీ, జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ విభాగాలకు ఫిర్యాదులు అందడంతో త్వరలోనే కేంద్ర దర్యాప్తు బృందాలు జిల్లాకు రానున్నాయి. ఈ గ్రానైట్ స్కాం కేవలం చిన్న మొత్తం కాదు ? ఇది భారీ ఎత్తున జరిగిన అక్రమాల సమూహం. రూ.749 కోట్ల రాయల్టీ నిధులు ప్రభుత్వానికి చెల్లించకుండా మోసం చేశారు. రూ.వేల కోట్ల విలువైన గ్రానైట్ అక్రమంగా తవ్వి, అమ్మకం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. విదేశీ మారకద్రవ్య నిబంధనల (ఫెమా) ఉల్లంఘనపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలు, అవినీతిపై ప్రధాని కార్యాలయం దృష్టికి రావడంతో పాటు, ఈ కేసును అనేక కేంద్ర సంస్థలకు ఫిర్యాదు చేశారు. సీబీఐ అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేస్తోంది. ఎన్‌జీటీ కూడా పర్యావరణ నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరుపుతోంది. జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ పన్ను ఎగవేత, ఆర్థిక మోసాలపై విచారణ జరుపుతుంది. ఫెమా ఉల్లంఘనపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. తెలంగాణ విజిలెన్స్ శాఖ ఈ కేసుపై సమగ్ర నివేదిక తయారు చేసింది. లైసెన్స్ లేకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా గ్రానైట్ తవ్వకాలు జరిపినట్లు తెలిపింది. వసూలు చేసిన రాయల్టీ నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా దారి మళ్లించారని పేర్కొంది. మైనింగ్ శాఖ, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడించింది. గ్రానైట్ బ్లాకులను అక్రమంగా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు తరలించడంలో రవాణా శాఖ అక్రమాలు చేసినట్లు తెలిపింది. ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం ఫెమా (విదేశీ మారకద్రవ్య నిబంధనల చట్టం) ఉల్లంఘన. గ్రానైట్ ఎగుమతుల ద్వారా వచ్చిన విదేశీ మారకద్రవ్యం సరైన ఛానల్స్ గుండా రాలేదు. విదేశీ ఖాతాల్లో డబ్బు దాచిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది కేవలం రాష్ట్ర స్థాయి నేరం కాదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది.

# నగరంలో హీట్ ఐలాండ్ ఎఫెక్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 13, తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ అధికారులు అలర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలో రానున్న ఏడు రోజుల పాటు తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని హెచ్చరించారు. ఆదిలాబాద్, నల్గొండ, సూర్యాపేటతో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోనూ 42 డిగ్రీల వరకు ఎండ తీవ్రత ఉండనుందని చెబుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రయాణాలు తగ్గించుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణలో భానుడు భగ్గుమంటున్నాడు. చాలా ప్రాంతాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 తర్వాత కాలు బయట పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఉదయం 10 తర్వాత రాష్ట్రంలోని చాలా పట్టణాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్ర ఎండలతో పాటు భరించలేని ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి కాలం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా టార్చర్ హీట్‌వేవ్ కొనసాగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అదనంగా నమోదవుతుండగా.. రానున్న వారం రోజులు మునుపెన్నడూ లేని విధంగా గరిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు చేరుకుంటాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, సరిహద్దు జిల్లాలైన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అలాగే దక్షిణ తెలంగాణ జిల్లాలు నల్గొండ, సూర్యాపేట, గద్వాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అంటున్నారు. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు. ఆయా జిల్లాల్లో మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావటం మంచిది కాదని చెబుతున్నారు. హీట్ వేవ్స్ తీవ్రత కారణంగా శరీర ఉష్ణోగ్రతను అకస్మాత్తుగా పెరిగే ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు. హైదరాబాద్‌లో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని చెబుతున్నారు. కాంక్రీట్ భవనాలు, వాహనాల రద్దీ వల్ల నగరంలో హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ కనిపిస్తోందని అంటున్నారు. వచ్చే వారం రోజుల పాటు నగరంలో వరుసగా 40 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. నగరవాసులు తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచించింది. ఇతర జిల్లాల్లో కూడా సగటు ఉష్ణోగ్రతలు 41 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ జాగ్రత్తలు తీసుకోండి.. తీవ్రమైన ఎండల దృష్ట్యా తెలంగాణ ఆరోగ్య శాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు. బయటకు వెళితే.. గొడుగు లేదా టోపీ వంటివి ధరించాలి.

దాహం లేకపోయినా క్రమం తప్పకుండా నీరు తాగుతూ ఉండాలి. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి లిక్విడ్ పదార్థాలు శరీరంలో డీహైడ్రేషన్ రాకుండా కాపాడతాయి.

లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం వల్ల శరీరానికి గాలి తగిలి వేడి తగ్గుతుంది.

నూనెలో వేయించిన పదార్థాలు, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండాలి. అధిక ప్రోటీన్ ఉండే ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ ఉష్ణాన్ని ఉత్పత్తి చేస్తుంది, కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎండల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి. అస్వస్థతగా అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# నమిత్ శర్మ... కథ చాలా ఉంది..

హైదరాబాద్, ఏప్రిల్ 13, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ లో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మాదక ద్రవ్యాల పార్టీ జరిగింది ఈ సంఘటన తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును తెలంగాణ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. ఈ క్రమంలో ఈ కేసు కు సంబంధించిన అనేకమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు నమిత్ శర్మ.. పోలీసులపై కాల్పులకు పాల్పడ్డాడు. నమిత్ శర్మది ఢిల్లీ. ఇతడు ఒక వ్యాపారి. కృత్రిమ మేధ సహాయంతో ఇతడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. హోం శాఖ మంత్రి అమిత్ షా.. ఐసీసీ చైర్మన్ జై షా తో ఫోటోలు దిగినట్టు చూపించాడు. వారితో అత్యంత సన్నిహితమైన సంబంధం ఉందని నమ్మించాడు. రోహిత్ రెడ్డితో పరిచయం పెంచుకున్నాడు. అంతేకాదు, ప్రధానమంత్రి పుట్టిన రోజు వేడుకకు హాజరైనట్టు చెప్పాడు. దానికి సంబంధించిన ఫోటోలను కూడా బయటపెట్టాడు. నమిత్ శర్మ మాటలను పూర్తిగా నమ్మిన రోహిత్ రెడ్డి పలు సంస్థలలో పెట్టుబడులు పెట్టినట్టు తెలుస్తోంది. కేవలం రోహిత్ రెడ్డిని మాత్రమే కాకుండా, ఇంకా చాలామంది ప్రముఖులను అతడు తప్పుతోవ పట్టించినట్టు సమాచారం. ఈ కేసును అనేక విడతలుగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితులు పోలీసులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనంగా ఉంటున్నారు. దానివల్ల ఈ కేసు విచారణలో జాప్యం జరుగుతోంది. మరోవైపు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ను పోలీసులు విచారించే అవకాశం కనిపిస్తోంది. విచారణ కు హాజరు కావడానికి అతడు గడువు కోరాడు. దీనికి దర్యాప్తు బృందం అంగీకరించింది. ఈ కేసులో అతని పాత్ర గురించి పోలీసులు మరిన్ని విషయాలు తెలుసుకోవాల్సి ఉంది. అది నిర్ధారణ అయిన తర్వాత.. అసలు ఏం జరిగిందనేది వెలుగులోకి వస్తుందని దర్యాప్తు బృందం అధికారులు చెబుతున్నారు.

# సీతక్క నూ మాజీ ఎమ్మెల్యే గండ్ర మండిపాటు

వరంగల్ అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లలో అవినీతి జరిగిందని సోషల్ మీడియా మరియు ప్రతిపక్షంగా అడిగితే "చెప్పులు తెగుతాయి" వంటి వ్యాఖ్యలు చేయడం ఇదేం సాంప్రదాయమని మంత్రి సీతక్క వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. మంత్రి సీతక్క బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి డిమాండ్ చేసారు. రాజకీయాల్లో ఆరోపణలు వస్తే వాటిని ఆధారాలతో సహా నిరూపించాలి గానీ. "చెప్పు తెగుతుంది" వంటి పరుష వ్యాఖ్యలు చేయడం తగదు. తమపై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ.. వాటికి ఎప్పుడూ సముచితంగా సమాధానం ఇచ్చామే తప్ప ఈ విధంగా దూషణలకు దిగలేదు. అధికారంలో ఉండి కేవలం ఆరోపణలు చేయడం సరైంది కాదు.

భూపాలపల్లి గడ్డమీద నేటి ముఖ్యమంత్రి, అప్పట్లో టిపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, నాపై 1400 ఎకరాల భూమి కబ్జా చేశాడని ఆరోపణలు చేశారు.. రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ ఆరోపణలు నిరూపించలేకపోయారు .. ఇప్పటికే నేను దానిపై కోర్టులో పరువు నష్టం కేసులు, క్రిమినల్ కేసులు దాఖలు చేశాను. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు.., కానీ ప్రభుత్వం నుంచి ఇలాంటి భాషలో స్పందించడం అనుచితమని అన్నారు.

# డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ

హైదరాబాద్, ఏప్రిల్ 13, తెలంగాణ ప్రభుత్వం మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ప్రారంభించింది. గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక ఎస్ఐసీయూ, కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఎఉంఔః అందించే అత్యాధునిక కిట్‌ల ద్వారా 12 రకాల డ్రగ్స్‌ను నిమిషాల్లోనే గుర్తిస్తున్నారు. బాధితులకు 6 వారాల పాటు పునరావాసం కల్పిస్తూ.. చట్టపరమైన నిబంధనల ప్రకారం చికిత్స అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే నార్కోటిక్ విభాగంతో పాటు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తుపై ఉత్తుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ.. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్ ముఠాలను కట్టడి చేస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్ల దాడులు నిర్వహించి పలువుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఒక సామాజిక విపత్తుగా మారుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు.. అన్ని జిల్లాల్లోనూ ఏకకాలంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఈ కేంద్రాల్లో మల్టీ-డ్రగ్ టెస్ట్ కిట్‌లను సరఫరా చేశారు. ఈ కిట్‌ల ద్వారా గంజాయి, ఓపియాయిడ్స్, కొకైన్, యాంఫెటమైన్స్ వంటి దాదాపు 12 రకాల మాదకద్రవ్యాలను మూత్ర పరీక్ష ద్వారా కేవలం నిమిషాల్లోనే గుర్తించవచ్చు. గాంధీ ఆసుపత్రి సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ కె. అనుపమ తెలిపిన వివరాల ప్రకారం.. కిట్‌లో ఎరుపు గీత కనిపించకపోతే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక పరీక్షలు మాత్రమే. అవసరమైతే మరిన్ని లోతైన క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు. గత రెండు రోజుల్లో 90 మందికి పరీక్షలు చేయగా.. సుమారు 40 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన వ్యసనానికి గురైన వారు లేదా మత్తు పదార్థాలు అందక శారీరకంగా ఇబ్బంది పడే వారి కోసం సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఐసీయూ తరహాలోనే పనిచేస్తుంది. డ్రగ్స్ మానేయడం వల్ల వచ్చే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితుల్లో రోగులను ఇక్కడ చేర్చుకుని నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. పోలీసులు తీసుకొచ్చే నిందితుల విషయంలో ప్రభుత్వం పక్కాగా నిబంధనలు అమలు చేస్తోంది. నిందితులను పరీక్షల కోసం ఫారమ్ ంతో తీసుకొస్తారు. ఫలితాలను ఫారమ్ ఃలో నమోదు చేస్తారు. నిందితుడు చికిత్సకు అంగీకరిస్తే ఫారమ్ అ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపడతారు. చికిత్స తర్వాత రోగులను డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్స్‌కు పంపిస్తారు. ఇక్కడ ఆరు వారాల పాటు నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీ, నార్కోటిక్స్ అనానిమస్ వంటి గ్రూప్ సెషన్లు నిర్వహిస్తారు. వ్యసనం అనేది ఒక వ్యాధి అని దానిని చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది యువత తిరిగి సాధారణ జీవితం గడిపే అవకాశం కలుగుతుందని అంటున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కడప మైదుకూరు మండలం జీవి సత్రం సమీపంలో ఇంజనీరింగ్ కాలేజీ బస్సును సిమెంట్ లారీ ఢీకొంది. కడప శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ బస్సును లారీ వెనుక నుండి వేగంగా ఢీకొంది. లారీ బస్సునే కాక మరో కారును కూడా ఢీకొంది. ఈ ఘటనలో ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి హేమంత్, డ్రైవర్ కు గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని మైదుకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఎల్పీజీ కష్టాలకు చెక్...

హైదరాబాద్, ఏప్రిల్ 13, పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఎల్పీజీ సరఫరాలో తలెత్తే ఇబ్బందులను అధిగమించడానికి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పైపుల ద్వారా సహజ వాయువు పంపిణీని ప్రభుత్వం వేగవంతం చేసింది. గోదావరి బేసిన్ నుంచి పూడూరు ప్లాంట్ ద్వారా గ్యాస్‌ను తీసుకుని ఇళ్లకు సరఫరా చేసేందుకు భాగ్యనగర్, మెగాసిటీ గ్యాస్ ఏజెన్సీలు సిద్ధమవుతున్నాయి. పైప్‌లైన్ల నిర్మాణానికి 24 గంటల్లోనే వాట్సప్ ద్వారా అనుమతులు ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇరాన్-ఇజ్రెయిల్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ప్రస్తుతం గ్యాస్ కొరత ఏర్పడింది. బుక్ చేసిన నెల రోజులకు కూడా సిలిండర్ దొరకని పరిస్థితి. గ్యాస్ కోసం ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఇంధన భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం ఎల్పీజీ సరఫరాకు ఆటంకాలు కలగకుండా ఉండేందుకు.. పైపుల ద్వారా సహజ వాయువును నేరుగా ఇళ్లకు సరఫరా చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్‌లో ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తోంది.ఈ భారీ ప్రాజెక్టుకు మూలం గోదావరి బేసిన్. కాకినాడ నుంచి ముంబై మీదుగా అహ్మదాబాద్ వరకు సాగే ప్రధాన గ్యాస్ పైప్‌లైన్ మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామం మీదుగా వెళ్తోంది. ఇక్కడ ఉన్న ఎల్పీజీ నిల్వ ప్లాంట్ ద్వారా గ్యాస్‌ను సేకరించి అక్కడి నుంచి భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీ లిమిటెడ్, మెగాసిటీ గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు పంపిణీ చేయనున్నాయి. దీనివల్ల సిలిండర్ల బుకింగ్, డెలివరీ కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ప్రాజెక్టు వేగంగా పూర్తి కావడానికి రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, మనుచౌదరిలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పైప్‌లైన్ల నిర్మాణానికి రోడ్లు తవ్వాల్సి ఉంటుంది. దీని కోసం దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే అనుమతులు ఇచ్చేలా ప్రత్యేక కమిటీని నియమించారు.అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తూ ఒక ప్రత్యేక వాట్సప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఏజెన్సీలు తమ దరఖాస్తులను ఇందులోనే పంపవచ్చు. మొదటి విడతలో భాగంగా సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని తొమ్మిది మున్సిపాలిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

పీఎన్‌జీ వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా.. సురక్షితంగా నిరంతరాయంగా అందుబాటులో ఉంటుంది.

గృహ వినియోగదారులతో పాటు అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, రెస్టారెంట్లకు కూడా ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ పైప్‌లైన్ నెట్‌వర్క్ పూర్తయితే.. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఇంధన వినియోగం సరికొత్త పుంతలు తొక్కనుంది.

# ఇప్పపువ్వు లడ్డూకు పెరిగిన ప్రాధాన్యత

హైదరాబాద్, ఏప్రిల్ 13, ఇప్ప పువ్వు లడ్డు అత్యంత బలవర్ధకమైన, సాంప్రదాయ ఆరోగ్యకరమైన స్వీట్. ఈ లడ్డూలో సహజ సిద్ధమైన తీపితోపాటు ఇనుము(ఐరెన్), ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. గర్భిణులకు, రక్తహీనత ఉన్న వారికి ఇది చాలా ప్రయోజనకరం.

ఈ లడ్డూలో ఔషధగుణాలు కూడా పుష్కలంగా ఉంటంతోపాటు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.ప్రతిరోజూ ఈ లడ్డు తినడం వల్ల 45 రోజుల్లో శరీరంలో రక్తశాతం పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అంతేకాదు రక్తహీనత, నీరసం, మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని సూచిస్తున్నారు. దీంతో ఆదివాసీ గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఇప్ప పువ్వుల లడ్డూలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని అడవి ప్రాంతంలో వేసవిలో 45 రోజులపాటు మాత్రమే దొరికే ఇప్పపువ్వులను ఆదివాసి, గిరిజనుల ద్వారా సేకరించి, లడ్డూలు తయారీ సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారు.ఎండిన ఇప్ప పూలు, బెల్లం, వేరుశెనగ, నువ్వులు, నెయ్యి, డ్రై ఫ్రూట్స్‌తో పాటు సువాసన కోసం యాలాకులను కలిపి, మిశ్రమంగా చేసి ఇప్పపూల లడ్డూలను తయారు చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన తర్వాత, ఈ లడ్డూలకు ప్రాచుర్యం విపరీతంగా పెరిగింది. ఇది కేవలం తీపి పదార్థం మాత్రమే కాదు, ఒక ఆరోగ్యకరమైన 'సూపర్ ఫుడ్'గా, శరీరానికి తక్షణమే శక్తినిచ్చే సంప్రదాయకమైన, ఆరోగ్యకరమైన స్వీట్‌గా, మెండుగా ఔషధ గుణాలున్న లడ్డూగా ప్రసిద్ధి చెందుతోంది.ఈ లడ్డూలను ఆదిలాబాద్ జిల్లాలో విక్రయించడంతోపాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని శిల్పారా మంలో ఇందిరా శక్తి భవన్‌లో అమ్ముతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 124 ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కోసం ఇప్పపు లడ్డూలను సరఫరా చేస్తున్నారు.జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలకు ప్రతివారం 39 క్వింటాళ్ల ఇప్పపూల లడ్డూలను సరఫరా చేస్తున్నట్లు అధ్యక్షురాలు కుంరా బాగుబాయి తెలిపారు. 17 మందిఆదివాసి గిరిజన మహిళలు ఇప్ప లడ్డూలను తయారు చేస్తూ.. ఉపాధి పొందుతున్నారు. అంతేకాదు మంచి పోషకాలు గల ఇప్పపూల లడ్డూలను తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యానికి దోహోదపడుతున్నారు. ఆదివాసి గిరిజనులు వేసవికాలంలో తెల్లవారకముందు అడవికి వెళ్లి సేకరిస్తున్న ఇప్పపువ్వు ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుంది.

గిరిజన మహిళలు తయారు చేసే ఇప్పపువ్వు లడ్డూలను తింటే శరీరానికి ఎంతో తక్షణ శక్తి లభిస్తుంది. అంతేకాదు ఇప్ప పువ్వును నేరుగా తింటే బీపీ, షుగర్ వ్యాధులను అరికట్టడంతో పాటు రక్తనాళాలను కూడా శుభ్రం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గిరిజనులు తమ దేవతలకు నైవేధ్యంగా విప్పపర్క నూనెలతో గారెలను చేసి, దేవతలకు సమర్పిస్తారు.అదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన, ప్రస్తుత పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఇప్పపువ్వుతో ప్రజలకు ఆరోగ్యంగా ఎంతో మేలు జరుగుతుందని గుర్తించారు. ఇప్పపూలు తినడంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని సంకల్పించారు. ఇప్పపువ్వు లడ్డూలను తయారుచేసి ప్రజలకు అందిస్తే కొంతమేరకు ఆరోగ్యం మెరుగుపడుతుందని భావించి, ఇందుకు ఆదివాసి గిరిజన మహిళలను ఎంపిక చేశారు.ఎంపిక చేసిన మహిళలకు ఇప్ప పూలతో లడ్డూలు తయారీపై శిక్షణ ఇప్పించారు. లడ్డూల తయారీకి ఇప్ప పూలను సేకరించేందుకు, ఇందుకు కావలసిన అన్ని ఏర్పాట్లను చేసుకునేందుకు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించారు. దీంతో ఇప్ప పూల లడ్డూలను తయారీ చేస్తూ విక్రయిస్తున్నారు.ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇప్ప పూల చెట్లు తగ్గిపోతున్నాయని కొంతమంది గిరిజనులు దివ్య దేవరాజన్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో హరితహారం నర్సరీలో ఇప్ప పూల మొక్కలను పెంచాలని సూచనలు చేశారు. నర్సరీలో పెంచిన మొక్కలను చేనులో నాటే విధంగా మొక్కల సరఫరాను నాగోబా ఆలయంలో పంపిణీ చేయించారు. కలెక్టర్‌గా పంపిణీ చేసిన మొక్కలను గిరిజనులు చేను గట్లపై నాటుకున్నారు.

అవి పెరుగుతున్నాయి..12 మంది స భ్యులతో ఏర్పడిన సంఘం ద్వారా 17 మందికి ఉపాధి కల్పిస్తున్నామని బాగుబాయి తెలిపింది. ప్రతి మహి ళకు నెలకు రూ.15 వేలు చెల్లిస్తున్నామన్నారు. ఉట్నూర్‌లో తయారుచేసిన ఇప్ప పూల లడ్డూలను రాష్ట్ర రాజధానిలోని శిల్పారామంలోని ఇందిరా శక్తి భవన్‌లోని 41 గదిలో విక్రయి స్తున్నా మని తెలిపారు. ఇక్కడ తయారుచేసిన లడ్డూలను ప్రతిరోజూ పంపించి విక్రయిస్తున్నామని ఆమె తెలిపింది. గ్రామాల్లో రూ.100 చొప్పున కేజీ ఇప్పపువ్వును ప్రస్తుతం సేకరిస్తున్నామని ఆమె తెలిపారు.

# మళ్లీ టీఆర్ఎస్సే...

హైదరాబాద్, ఏప్రిల్ 13, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. గత ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ఆయన సిద్ధం చేసిన కార్యాచరణను ఈ సందర్భంగా బయటపెట్టారు.బీఆర్ఎస్ పార్టీ పేరు మార్పు గురించి కేటీఆర్ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చడం వల్ల పార్టీకి నష్టం చేకూరిందని ఆయన అంగీకరించారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన తెలంగాణ సెంటిమెంట్ పార్టీ పేరు మారడంతో కొంత పలచబడిందని భావిస్తున్న ఆయన, పార్టీని తిరిగి 'టీఆర్ఎస్'గానే మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇది కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా భావిస్తున్నామన్నారు.పదేళ్ల పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అప్పుడు తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు.వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ తేల్చి చెప్పారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఆయన ఖచ్చితంగా కొట్టిపారేశారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఒక భ్రమ అని వ్యాఖ్యానిస్తూ, ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించారు. స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తామని, ప్రజాక్షేత్రంలోనే తమ బలాన్ని నిరూపించుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. కవిత కామెంట్స్ నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి..గత ప్రభుత్వ హయాంలో కొన్ని చిన్నపాటి లోపాలు జరిగాయని కేటీఆర్ ఈ సందర్భంగా అంగీకరించారు. ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరగడం వల్లనే ఆశించిన ఫలితాలు రాలేదని, ఆ పొరపాట్లపై ఇప్పటికే లోతైన అధ్యయనం చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ లోపాలను సరిదిద్దుకుని మళ్లీ ప్రజల్లోకి వెళ్తామని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఇక డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయని ఆయన తెలిపారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరగడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తెలుగు రాష్ట్రాల చరిత్రలో నలుగురు ముఖ్యమంత్రులు మాత్రమే తమ పాలనతో చెరగని ముద్ర వేశారని కేటీఆర్ అభివర్ణించారు. ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు నాయుడుతో పాటు కేసీఆర్ పేరు కూడా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన ప్రశంసించారు. చంద్రుడిపై మబ్బులు కమ్మినంత మాత్రాన వెలుగు తగ్గదని, కేసీఆర్ మళ్లీ ఉజ్వలంగా ప్రకాశిస్తారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# అతిథి పక్షులకు స్వర్గధామం

వరంగల్, ఏప్రిల్ 13, అనేక సంవత్సరాలుగా వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే విదేశీ అతిథి పక్షులకు స్వర్గధామంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి నిలుస్తోంది. ప్రకృతి అందాలతో నిండిన ఈ గ్రామంలోని చెరువులు, చెట్లు వలస పక్షులను అక్కున చేర్చుకుని, ఆశ్రయం ఇచ్చి.. పురుడుపోస్తున్నాయి.అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల పుట్టినిల్లుగా ఏళ్ల తరబడి నిలబెడుతున్న గ్రామస్తులు ఎంతో స్ఫూర్తినిస్తున్నారు. పక్షుల తల్లిప్రేమను, పిల్లల కేరింతలను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతున్నారు. సైబీరియా వంటి చల్లని ప్రాంతాల నుంచి పక్షులు, ముఖ్యంగా కొంగలు (పెయింటర్ స్టోర్క్) మేచరాజుపల్లికి తరలివచ్చి, నివాసం ఏర్పరచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేలసంఖ్యలో సైబీరియన్ కొంగలు, ఇతర వలస పక్షులు చేరుకుంటాయి. చల్లని దేశాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వేడి ప్రాంతాల కోసం ఈ పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయా ణించి ఇక్కడకు ప్రతి ఏటా క్రమం తప్పకుం డా వస్తాయి.డిసెంబర్ నుంచి జూలై వరకు గ్రామంలోని చెట్లపై గూళ్లు కట్టి గుడ్లు పెట్టి సంతానోత్ప త్తి చేసి, పిల్లలు పెద్దయ్యాక తిరిగి జూలై నెలలో పిల్లలతో కలిసి తమ స్వదేశాలకు వెళ్లిపోతాయి. వీటి ప్రధా న ఆహారం చెరువులోని చేపపిల్లలు. చేప పిల్లలను వేటాడి చెట్లపై నిలువ పెట్టుకోవడం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది.మేచరాజుపల్లి చెరువు పరిసర ప్రాంతా ల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పక్షుల కిలకిలారావాలు వినిపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటాయి. గుంపులుగా ఎగిరే పక్షు లు ఆకాశంలో అద్భుత దృశ్యాన్ని సృష్టిస్తా యి. ఈ కాలంలో చెట్లపై కనిపించే వందలాది విదేశీ అతిథి పక్షులను చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.గ్రామస్థులు ఈ పక్షులను తమ అతిథులుగా భావించి, సంరక్షణ చర్యలు చేపడుతు న్నారు. ప్రతి ఏడాదీ వచ్చే విదేశీ అతిథి పక్షు ల రాక కోసం నిరీక్షించడం, చెట్లను నరకకుండా కాపాడటం, పక్షులకు ఇబ్బంది కలి గించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలా అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల ఆవాసంగా ఏళ్ల తరబడి నిలబెట్టుతున్నారు.ఒక్కో పక్షి మూడు నుంచి నాలుగు గుడ్లు పెట్టి, 30 నుంచి 45 రోజుల పాటు పొదుగుతుంటాయి. జన్మించిన తమ పిల్లలకు ఇక్కడే ఎగరడం, మేత మేయడం, ఆహారాన్ని సంపాదించడం తదితర నైపుణ్యాలను తల్లి పక్షులు నేర్పిస్తుంటాయి. ఈ ప్రకృతి విన్యాసాలను, తల్లిప్రేమను, పిల్లపక్షుల కేరింతల ను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతుంటారు. ప్రకృతి అందాలు, విదేశీ వలస పక్షుల సందడి కారణంగా మేచరాజుపల్లి పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పక్షి ప్రేమికులకు, ప్రకృతి సందర్శకులకు ఆకర్షణీయ ప్రాంతంగా అభివృద్ధి చెం దుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పక్షుల సంరక్షణకు చెరువు అభివృ ద్ధి, చెట్ల సంరక్షణ, పర్యాటక సదుపాయాల కల్పన వంటి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.పర్యావరణ పరిరక్షణ తో పాటు పర్యాటకాభివృద్ధి జరిగితే మేచరాజుపల్లి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. వేల కిలోమీటర్ల ప్రయా ణం చేసి వచ్చే అతిథి పక్షులతో మేచరాజుపల్లి ప్రకృతి సోయగంగా మారుతూ నిజమై న పక్షుల స్వర్గధామంగా నిలుస్తోంది

# 14 ఏళ్ల నాటి కల...

కరీంనగర్, ఏప్రిల్ 13, రాజకీయాల్లో ఏ వ్యూహం ఎప్పుడు పారుతుందో.. ఏ స్కెచ్ ఎప్పుడు ఫలిస్తుందో ఎవరూ ఊహించలేరు. ప్రత్యర్థి పార్టీని నామరూపాలు లేకుండా చేయాలనే పంతం పన్నెండేళ్ల తర్వాత ఇప్పుడు కార్యరూపం దాల్చడం చూస్తుంటే రాజకీయ చదరంగం ఎంత చిత్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కాంగ్రెస్‌ను ఖాళీ చేయాలని కేసీఆర్ వేసిన ప్లాన్ చేశారు. ఇన్నాళ్లకు 'జగిత్యాల టైగర్' జీవన్ రెడ్డి రూపంలో సక్సెస్ అయింది. అప్పట్లో తృటిలో తప్పిన ఈ ఫిరాయింపు, ఇప్పుడు రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయాల పుణ్యమా అని సాధ్యపడింది. రాజకీయాల్లో ఫిరాయింపులు కొత్త కాదు కానీ, పన్నెండేళ్ల క్రితం వేసిన స్కెచ్ ఇప్పుడు ఫలించడం విశేషం. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరినీ టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) కలిపేసుకోవాలని గట్టి ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే జీవన్ రెడ్డికి గులాబీ గూటి నుంచి ఆహ్వానం అందింది. అయితే ఈ విషయాన్ని తాజాగా జరిగిన ప్రెస్ మీట్‌లో జీవన్ రెడ్డి స్వయంగా బయటపెట్టారు. అటు కేటీఆర్ కూడా 'ఆయన 2014లోనే మా పార్టీలోకి రావాల్సింది, అది ఇప్పటికి కుదిరింది' అని వ్యాఖ్యానించడం ద్వారా నాటి స్కెచ్‌ను పరోక్షంగా ఒప్పుకున్నట్లు అయ్యింది.జగిత్యాల పంచాయతీ జీవన్ రెడ్డి మనస్థాపానికి ప్రధాన కారణం తన రాజకీయ ప్రత్యర్థి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడమే. రెండు ఎన్నికల్లో తనను ఓడించిన వ్యక్తిని రేవంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించడాన్ని జీవన్ రెడ్డి తట్టుకోలేకపోయారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోవడం, మెజారిటీ కౌన్సిలర్లు సంజయ్ వర్గం వైపు ఉండడంతో జీవన్ రెడ్డికి సొంత గడ్డపైనే భంగపాటు జరిగింది. మున్సిపల్ ఛైర్మన్ పీఠం దక్కకపోవడంతో తన రాజకీయ భవిష్యత్తుపై ఆయన ఒక నిర్ణయానికి వచ్చారు. ఎంతో కాలం నిరీక్షించిన జీవన్ రెడ్డి రేవంత్ రెడ్డి నాయకత్వంపై యుద్ధం ప్రకటించారు. ముఖ్యమంత్రిని గద్దె దించడమే లక్ష్యమని చెబుతూ బీఆర్ఎస్ లో కలిసిపోయారు. ఒకప్పుడు కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి అన్నట్లుగా జగిత్యాల రాజకీయం సాగేది, కానీ ఇప్పుడు అదే పార్టీని ఓడించడానికి ఆయన కేంకార్ వేస్తున్నారు. అయితే, ఫిరాయింపులను వ్యతిరేకించే బీఆర్ఎస్, ఇప్పుడు ఒక కాంగ్రెస్ సీనియర్ నేతను చేర్చుకుంటూ పాత స్కెచ్‌లను గొప్పగా చెప్పుకోవడం రాజకీయ విడ్డూరమనే చెప్పాలి. ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తున్న ఫిరాయింపులు అనైతికం అంటూ బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తూనే 2014లో జరిగిన విషయాన్ని కేటీఆర్ బయటపెట్టారు. జీవన్ రెడ్డి చేరిక సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పాత అనైతిక రాజకీయాలను గుర్తు చేస్తున్నాయి. 'అప్పుడే ఆయన రావాల్సింది' అని అనడం ద్వారా, నాడు తాము కూడా కాంగ్రెస్‌ను ఖాళీ చేసే కుట్రలు చేశామని కేటీఆర్ అంగీకరించినట్లయ్యింది. ప్రత్యర్థిపై విమర్శలు చేసే క్రమంలో తమ పాత వ్యూహాలే ఇప్పుడు తమకు అస్త్రాలుగా మారడం విశేషం. పుష్కరం కిందట కేసీఆర్ వేసిన విత్తనం ఇప్పుడు చెట్టయ్యింది. జీవన్ రెడ్డి చేరికతో జగిత్యాల రీజియన్‌లో బీఆర్ఎస్ కు కొత్త బలం చేకూరవచ్చు కానీ, ఇది సిద్ధాంతాల పరంగా ఆ పార్టీకి ఒక పరీక్షే. ఫిరాయింపుల రాజకీయాలను ఇరు పక్షాలు తప్పుబడుతున్నా, చివరికి అవే మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. 2014లో కేసీఆర్ వేసిన స్కెచ్ ఇన్నాళ్లకు వర్కవుట్ అయింది సరే.. మరి దీనివల్ల జీవన్ రెడ్డికి, బీఆర్ఎస్ కు కలిగే అసలు ప్రయోజనం ఏంటో రాబోయే కాలమే తేల్చాలి.

# రేవంత్ జీడీపీ ఫార్ములా వర్కౌటవుతుందా

హైదరాబాద్, ఏప్రిల్ 13, నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు భారత రాజకీయాల్లో ఒక సెన్సిటివ్ వార్ జోన్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం జనగణన తర్వాత 50 శాతం సీట్ల పెంపు ఫార్ములాతో వడివడిగా అడుగులు వేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై ధ్వజమెత్తుతున్నారు. కేవలం సీట్ల పెంపు అనేది అంకెల గారడీ మాత్రమేనని, ఇది దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడమేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న అభ్యంతరాలు, ఆయన ప్రతిపాదిస్తున్న జీడీపీ ఫార్ములా ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.కేంద్రం ఆలోచిస్తున్న 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదనను రేవంత్ రెడ్డి పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. అందరికీ సమానంగా సీట్లు పెంచినప్పటికీ, అంతిమంగా ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యమే కొనసాగుతుందని ఆయన విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాదిలోని కేవలం నాలుగు రాష్ట్రాల ఎంపీ సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వస్తే, అది సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జనాభా నియంత్రణ పాటించాయి. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అద్భుత ప్రగతి సాధించాయి. ఇప్పుడు కేవలం జనాభా తక్కువగా ఉన్నారనే కారణంతో పార్లమెంట్‌లో మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అంటే.. క్రమశిక్షణతో ఉన్నందుకు మాకు ఇస్తున్న శిక్షా? అని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు.ఈ సంక్లిష్ట సమస్యకు రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన, హేతుబద్ధమైన పరిష్కారాన్ని ప్రతిపాదించారు. నియోజకవర్గాల కేటాయింపు కేవలం జనాభా మీద, లేదా నిర్దిష్టంగా 50శాతం అని కాకుండా, ఆయా రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న సహకారం ఆధారంగా ఉండాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. దేశానికి అత్యధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు నిర్ణయాధికారంలోనూ అంతే ప్రాధాన్యత ఉండాలని కోరుతున్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల రాజకీయ బలాన్ని తగ్గించడం వల్ల భవిష్యత్తులో రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. జనాభాను నియంత్రించి, ఆర్థికంగా ఎదిగిన రాష్ట్రాలను గౌరవించాలంటే జీడీపీని ఒక ప్రామాణికంగా తీసుకోవడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, మొండిగా ముందుకు వెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ అంశం మాత్రమే కాదని, కోట్ల మంది దక్షిణాది ప్రజల ఆత్మగౌరవ సమస్య అని ఆయన పేర్కొన్నారు. కేంద్రం గనుక దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, ఏకపక్షంగా పునర్విభజన చేపడితే భారీ ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. పార్లమెంట్ లోపల, బయట మా నిరసన గళం వినిపిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన రాబోయే కాలంలో దేశ సమగ్రతను ప్రభావితం చేసే అంశంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రశ్నలు కేవలం తెలంగాణ కోణంలోనే కాకుండా, మొత్తం దక్షిణాది ప్రయోజనాల దృష్ట్యా అత్యంత కీలకమైనవి. 50శాతం ప్రాతిపదికన జరిగే విభజన ఉత్తరాది-దక్షిణాది మధ్య అగాధాన్ని పెంచే ప్రమాదం ఉంది. మరి కేంద్రం రేవంత్ రెడ్డి సూచిస్తున్న జీడీపీ ఫార్ములాను పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.

# పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఇప్పట్లో నిధులు ఇవ్వలేము

హైదరాబాద్ సిద్దాపూర్ రిజర్వాయర్ కోసం నిధులు మంజూరు చేయడంలేదని పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. సిద్దాపూర్ రిజర్వాయర్ కోసం ఇప్పట్లో నిధులు ఇవ్వలేమని, పోచారం శ్రీనివాస్ రెడ్డి పెద్ద మనసుతో అర్థం చేసుకుంటారని భావిస్తున్నానని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో ఘోర ప్రమాదం

### ఒకే కుటుంబంలో ముగ్గురి దుర్మరణం
### రుక్మాపూర్ గ్రామానికించేందిన వారిగా గుర్తింపు
### మృతుల కుటుంబానికి కాలయముడైన గుర్తుతెలియని వాహనం
### భార్యాభర్తలు, కుమార్తె మృతి, కుమారుడు సేఫ్

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. మండల పరిధిలోని సిద్దన్నమడుగు తాండ ? తట్టేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..



పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన దంపతులు తమ కుమారుడు, కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై జహీరాబాద్ వెళ్తుండగా, గుర్తుతెలియని వాహనం వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు కుమార్తె తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, ఈ ప్రమాదం నుండి కుమారుడు గాయాలతో బయటపడటంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం

# ఉన్న గూడును కూల్చేస్తున్న రేవంత్ సర్కార్

హైదరాబాద్ హైడ్రా అంటే పేదల బ్రతుకులు కూల్చడానికి పెట్టారా రేవంత్ రెడ్డి ? అని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. నిన్న ఒక చిన్న పిల్ల ఇంట్లో ఉండగానే ఇల్లు కూల్చేస్తున్నారు. సామాన్లు బయటకు కూడా తీసుకోనివ్వకుండా కూల్చేస్తున్నారు.. ఇంత దుర్మార్గమా? ప్రభుత్వమంటే పేదలకు గూడు ఇవ్వాలి, కూడు పెట్టాలి.. కానీ రేవంత్ రెడ్డి ఉన్న గూడును కూల్చేస్తున్నాడని అన్నారు.

ఎప్పుడు భూములు, కమీషన్లు, కాంట్రాక్టుల మీదనే రివ్యూ చేస్తావా, రైతుల గురించి రివ్యూలు చేయవా రేవంత్ రెడ్డి ? పంట కొనుగోళ్లు జరగడంలేదని నీ ఇంటెలిజెన్స్ వ్యవస్థ చెప్పడంలేదా? చెప్పినా రైతులే కదా అని చిన్న చూపు చూస్తున్నావా? సాయంత్రం 4 గంటలకు పోయి పొద్దున 8 గంటలకు కరెంట్ వస్తుందని రైతులు చెప్తున్నారు. రైతుబంధు ఇయ్యవు, బోనస్ ఇయ్యవు, కరెంట్ ఇయ్యవు కనీసం రైతుల పంట మద్దతు ధరకు కొనుగోలు చేయలేని అసమర్థ ప్రభుత్వం నీదని మండిపడ్డారు.

# ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యామని ఆత్మహత్య చేసుకున్న ఏడుగురు విద్యార్థులు



తెలంగాణలో నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణులు కాలేదని ఆవేదనతో రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

వారసిగూడలో కళ్యాణి(16), నాచారంలో లక్ష్య(16), మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో సాయిరాం(16), ఉట్నూర్ గ్రామంలో సౌజన్య(17), భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో శ్రావణి(17), సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం చందుపట్ల గ్రామంలో సౌజన్య(17), రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ గ్రామంలో అభియాదవ్ అనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

# జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు

జగిత్యాల కాంగ్రెస్ పార్టీ లో వర్గపోరు సీఎం ఛాంబర్ కు చేరింది. ఎమ్మెల్యే సంజయ్ మీద ఫిర్యాదు చేసేందుకు ముఖ్యమంత్రి త్ రెడ్డిని కలవడానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ కు చేరుకున్నారు. మున్సిపల్ కో ఆప్షన్లలో సంజయ్ తమకు అన్యాయం చేశాడని కాంగ్రెస్ నాయకుల ఆవేదన. తనకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసేందుకు రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ తీసుకున్నారని తెలిసి, వారి అపాయింట్మెంట్ ఎమ్మెల్యే సంజయ్ రద్దు చేయించారిన వారంతా ఆరోపించారు.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల ఉత్సవం ప్రారంభం

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల (శ్రీ రామానుజాచార్యులు) ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 21న భోగి తేరు, ఏప్రిల్ 22న సాత్తుమొర, ఏప్రిల్ 23న గంధపొడి ఉత్సవం నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం భాష్యకార్ల వారికి బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో, సాయంత్రం పెద్ద వీధి ఉత్సవం వైభవంగా చేపడుతారు. అదేవిధంగా ప్రతిరోజు దివ్యప్రబంధ సేవాకాలం, సాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్రీనివాస దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతిని కలిసిన మంత్రి లోకేష్



న్యూఢిల్లీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని రాష్ట్రపతికి లోకేష్ వివరించారు. మంత్రి నారా లోకేష్ వెంట కూటమి ఎంపీలు ఉన్నారు.

# కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన ఎంపి ఈటల



మేడ్చల్ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్ను కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్ తో కలిసి ఎంపి ఈటల రాజేందర్ సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపిమాట్లాడుతూ పార్టీలు ఏవైనా కావచ్చు కానీ. ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్లుగా గెలిచిన తర్వాత ప్రజలకు సేవ చేసే కర్తవ్యమే ఉంటుంది తప్ప, వేరే పని చేసే ఆస్కారం ఉండదు. అంతిమ తీర్పరులు ప్రజలే కాబట్టి.. ఇవాళ రాఘవేంద్ర కాలనీలో ఎమ్మెల్యే గారు ఎమ్మెల్యే నిధులు తెచ్చి ఇచ్చిన, ఎంపీ గా నేను నిధులు తెచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా, మున్సిపాలిటీ ఇచ్చినా. మీరు (ప్రజలు) కట్టిన పన్నులకు మేము కాపలాదారులము మాత్రమే. "మేమే ఇస్తున్నాం, మేమే ఇస్తున్నాం" అని అనుకోవడానికి లేదని అన్నారు.

మీ డబ్బులకు మేము కాపలాగా ఉంటూ ఇంత పని చేయిస్తాము తప్ప అంతకన్నా ఏమీ లేదు. ఎవరికి అవకాశం ఉంటే వారు చేస్తారు. ఈ కమ్యూనిటీ హాల్ కోసం మేము ఇచ్చిన నిధులకు, మీరు మరిన్ని పైసలు తోడు వేసి కట్టారు. ప్రభుత్వం చేసే పనికి తోడుగా మీ కాలనీ పెద్దలు అనేక రకాలుగా సపోర్ట్ చేసి, ఇంత గొప్పగా నిర్మాణం చేసుకున్నారు. అన్ని పనులు ప్రభుత్వమే చేసేటటువంటి కెపాసిటీ ఉండదు, చేయలేవు కూడా. కాలనీ అసోసియేషన్లు గాని, గేటెడ్ కమ్యూనిటీలు గాని, మిగతా సంఘాలు గాని, ఇట్లాంటి పెద్దలు వాటికి తోడ్పాటు అందిస్తుంటారు, వారికి ధన్యవాదాలు. లోకల్ సమస్యల గురించి చెప్పారు.. అభివృద్ధి.. ఇది ఒక నిరంతర ప్రక్రియ (అనీనిబితినిబీనీబీబ జూతీనీఞవబబ). ఉన్నంతలో వాటిని కూడా త్వరగానే పరిష్కారం చేసుకుందామని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం..

### ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జ్ లోకి దూసుకుపోయిన టూ వీలర్
### లక్ష్మీ నారాయణపూర్ వద్ద సంఘటన

వికారాబాద్ జిల్లా యాలాల మండలం లక్ష్మీ నారాయణపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారికి చెందిన బ్రిడ్జి లోకి ప్రమాదవశాత్తు బైకు దూసుకుపోయి నర్సింలు(30) అనే కానిస్టేబుల్ దుర్మరణం చెందాడు. హైదరాబాద్ నగరంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ డ్యూటీ కి వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది.

# అబద్దపు ప్రచారం చేస్తున్న వైకాపా నేతలు

విజయవాడ మావిగన్ అంటే తెలుగు అర్థం వైసీపీ నాయకులు చెప్పగలరా. అమరావతి నిర్మాణానికి లక్షల కోట్లు ఖర్చవుతుందని, 'మావిగన్'కు అసలు ఖర్చే ఉండదని వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న అబద్ధ ప్రచారం అని రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య కొట్టిపారేసారు. జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల ప్రతిపాదన "సగం పిచ్చి" అయితే, 'మావిగాన్' అనేది "పూర్తి పిచ్చి" కి సంకేతం. అమరావతి అంటే సిఆర్డిఏ పరిధి మొత్తం. అమరావతి అంటే 29 గ్రామాలు మాత్రమే కాదు. సి ఆర్ డి ఏ హద్దులు ముందు జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలి. విజయవాడ రైల్వే స్టేషన్ (1888), గన్నవరం విమానాశ్రయం (1940), విజయవాడ బస్ స్టేషన్ (1990)లో నిర్మాణం జరిగాయి. బ్రిటీష్ కాలంలో జరిగిన నిర్మాణాలను కూడా జగన్ తన ఖాతాలో వేసుకుని మాట్లాడుతున్నాడు . అమరావతి రాజధానిగా రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. రాష్ట్రపతి ఆమోదం పొందిన రాజముద్ర అమరావతి రాజధాని. దానిని మార్చటం జగన్ వల్ల కాదు. మావిగన్ ఏ భాష ముందుగా వైసిపి నాయకులు చెప్పి మాట్లాడాలి. మచిలీపట్నం వంటి సముద్ర తీర ప్రాంతాల్లో , తుఫాను ప్రభావితం ప్రాంతాలలో రాజధాని పెట్టడం సాధ్యపడదు . 1977 దివిసీమ తుఫాను వంటి చేదు అనుభవాలు జగన్ ముందు తెలుసుకోవాలి. మచిలీపట్నంలో రాజధాని పెట్టాలి అంటున్న జగన్ గానీ, మాజీ మంత్రి పేర్ని నాని కానీ ఒక ఎకరం భూమి మచిలీపట్నంలో సేకరించగలరా?? అమరావతికి 3.6 లక్షల కోట్లు ఖర్చవుతుందనేది తప్పుడు ప్రచారం . ఇప్పటివరకు 54 వేల కోట్లకు మాత్రమే టెండర్లు పిలిస్తే సుమారు 50 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం 3.30 లక్షల కోట్లు అప్పు చేసింది. నవరత్నాలకు 2.70 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, మిగిలిన నిధుల లెక్క వైసిపి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పాలి . అమరావతి కేవలం 29 గ్రామాలకు సంబంధించింది కాదు. ఇది 1.10 కోట్ల జనాభా ఉన్న విజయవాడ-గుంటూరు ప్రాంత అభివృద్ధికి సంబంధించిన ప్రాంతం . రాష్ట్ర ఆర్థిక వృద్ధికి "అక్షయ పాత్ర" అమరావతి ప్రాంతం . రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఎలాంటి కష్టం కలగకుండా చంద్రబాబు ప్రభుత్వం చూస్తుంది . వైసీపీ నాయకుల, వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అన్నారు.

# ఎమ్మెల్యే కొలకపూడి కి ఎంపి చిన్ని వర్గం వార్నింగ్

తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడికి సొంత పార్టీ ఎంపీ కేశినేని చిన్ని వర్గం వార్నింగ్ ఇచ్చింది. టీడీపీ తిరువూరు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ దేవదత్ మీడియాతో మాట్లాడారు. బెల్టు షాపులు అడ్డుకోడానికి నువ్వు ఎవడివి. బెల్ట్ షాపుల్ని నువ్వు అడ్డుకునేది ఏంటి.. 175 నియోజకవర్గాల్లో ఎలా జరిగితే ఇక్కడ కూడా అలాగే జరుగుతుందని అన్నారు.

ఎంపీ తన దగ్గర డబ్బులు తీసుకోలేదు. అభివృద్ధి పైన, వ్యక్తిగత విషయాల పైన బహిరంగ చర్చకు సిద్ధమా. ఎమ్మెల్యే అయ్యి ఉండి పార్టీ పరువు తీస్తున్నావు . ఇలాంటి ఒక అసమర్థత ఎమ్మెల్యేని, కులాన్ని వాడుకునే ఎమ్మెల్యేని గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారని అన్నారు.

నువ్వు ఎందిరా పార్టీని బాగుచేసేది.. నువ్వు నాశనం చేయకుండా ఉంటే చాలు . ఎంపీ నా దగ్గర డబ్బులు తీసుకోలేదు.. నేను నా సమస్యని పరిష్కరించుకోగలను . మా సమస్యని మీ అవకాశం లాగా వాడుకోవద్దని అన్నారు.

# లగేజీ కౌంటర్ లో భక్తుల నుండి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి విధుల నుండి తొలగింపు

తిరుమలలోని లగేజీ సెంటర్ లో నరసింహారెడ్డి అనే వ్యక్తి భక్తుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు టీటీడీ దృష్టికి వచ్చింది.సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుండి తొలగించడం జరిగింది.టీటీడీ లగేజీ డిపాజిట్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. భక్తులెవ్వరూ తమ లగేజీ కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని టీటీడీ తెలియజేస్తోంది.నిబంధనలను అతిక్రమించి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే విజిలెన్స్ కంట్రోల్ నెంబర్ : 9866898630 కు ఫిర్యాదు చేయాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది.

# కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల ప్రభుత్వం

హైదరాబాద్ స్మార్ట్ ఫోన్ల కొనుగోలులో స్కామ్కు పాల్పడి 4జీ ఫోన్లు ఇస్తూ, 5జీ ఫోన్లు ఇస్తున్నామని చెప్పుకుంటున్న వారిని ఏ చెప్పుతో కొట్టాలో సీతక్క సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అన్నారు. అంగన్వాడీ వర్కర్ల కోసం ఇచ్చే స్మార్ట్ ఫోన్ల కాంట్రాక్ట్కు సీతక్కకు సంబంధమే లేదంటూనే, ఇప్పుడు చెప్పుతో కొడుతానని అనడం ఏంటని అయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల ప్రభుత్వం. అందుకే ఈ ప్రభుత్వం చేసే విచారణపై మాకు నమ్మకం లేదు. ఈ స్కామ్లో కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నాయి కాబట్టి, మేము సీబీఐ విచారణను డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# మునిసిపల్ ఛైర్ పర్సన్ గా మౌనికి

ఖాకాపూర్ నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్పర్సన్గా బాధ్యతలు చేపట్టిన అంకం మౌనిక ప్రమాణస్వీకారోత్సవంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు

రామచంద్రరావు మాట్లాడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కాంగ్రెస్ పార్టీ అవలంబించిన అప్రజాస్వామిక, కుటిల విధానాలను దీటుగా ఎదుర్కొని.. ఖానాపూర్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ సాధించిన ఈ విజయం మన కార్యకర్తల పట్టుదలకు నిదర్శనమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజల కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం: జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

## ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "ంతీతీతిలవ ంశ్రీతిలవ" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్శ్రీ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.




ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ? ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం "ంతీతీతిలవ ంశ్రీతిలవ" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు.




జిల్లా కలెక్టర్ శ్రీ సత్య ప్రసాద్ గారు మాట్లాడుతూ? రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న "ంతీతీతిలవ ంశ్రీతిలవ" కార్యక్రమం ప్రశంసనీయమని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా, నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. రోడ్డు భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. "వేగం ప్రాణం తీస్తుంది" అనే విషయాన్ని గుర్తుంచుకుని అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ఆర్టీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సుమారు 300 మంది విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా విస్తృత అవగాహన సదస్సులు జిల్లా కలెక్టర్ అంకిత్




భద్రాద్రి బ్యూరో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం విద్యానగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ-అడిక్షన్, కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామన్నారు . రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని అన్నారు. ఈ గ్రామసభల ద్వారా ప్రజల్లో



చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామసభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు. కొన్ని జిల్లాలో అమలు చేస్తున్న "నో హెల్మెట్ ? నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి, తహసిల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు



బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఆదివారం రాత్రి వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఊరిబిండి మహేష్ రెడ్డి, పరిటాల వెంకట సుబ్బయ్య (ఆర్య వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్), దేవిరెడ్డి తులసి రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ



కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బద్వేలు నియోజకవర్గం నాయకులు డాక్టర్ రాజశేఖర్ రాంబాబు పాలకొలను రాజశేఖర్ రెడ్డి జహంగీర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

### ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం

### నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,

ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకంగా మారిన నేపథ్యంలో, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన 150 సీసీ కెమెరాలను ఈరోజు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ? "ప్రజల రక్షణకు, నేరాల అరికట్టడానికి సీసీ కెమెరాలు అమూల్యమైన సాధనాలు. ప్రతి వీధి, ప్రతి మూలలో కెమెరాలు అమర్చడం వలన నేరం జరిగిన వెంటనే గుర్తించడం, నిందితులను పట్టుకోవడం చాలా వేగంగా జరుగుతోంది. సీసీ కెమెరాలు లేకపోతే కేసుల ఛేదనలో ఆలస్యం జరిగేది, కానీ ఇప్పుడు వాటి సహాయంతో విచారణ వేగవంతమైంది" అని తెలిపారు. దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనల్లో నిందితుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అవడంతో పోలీసులు తక్షణమే స్పందించి అరెస్టులు చేయగలిగిన అనేక ఉదాహరణలు ఉన్నాయని వివరించారు.

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ? "సీసీ కెమెరాలు పోలీసుల మూడో నేత్రం లాంటివి. ఇవి



నేరాలు జరగకుండా ముందుగానే హెచ్చరికగా పనిచేస్తాయి. కెమెరాలు ఉన్నాయన్న భయం నేరస్థుల్లో ఉంటుంది" అని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లకు, వ్యాపార సంస్థలకు, అపార్ట్‌మెంట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా ప్రధాన రహదారులు, క్రాస్ రోడ్లు, బిజీ సెంటర్లు, మార్కెట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత కూడా బలోపేతం అవుతుందని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన స్థానిక కళాశాలలు, పాఠశాల యాజమాన్యాలు, వ్యాపారవేత్తలు మరియు ఇతర సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ గారు అభినందించారు. ప్రజల సహకారం లేకుండా ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావడం కష్టమని, ఇదే స్ఫూర్తితో ఇతర ప్రాంతాల ప్రజలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో అధికారులపై కారం చల్లిన వృద్ధురాలు



ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనాసాగరం గ్రామంకు చెందిన తులసి అనే వృద్ధురాలు ఈరోజు విజయవాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సమావేశంలో ఆందోళనకు దిగింది. తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని నేషనల్ హైవే విస్తరణలో తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు సరైన పరిహారం చెల్లించలేదని ఆమె ఆరోపించింది. ఈ నేపథ్యంలో, పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన తులసి, సమావేశం జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా అధికారులపై కారం చల్లి నిరసన వ్యక్తం చేసింది. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది వెంటనే స్పందించి వృద్ధురాలిని అదుపులోకి తీసుకుని బయటకు పంపించారు. ఈ ఘటనలో ఎవరికి పెద్దగా గాయాలు కాలేదని సమాచారం. వృద్ధురాలు మాట్లాడుతూ, "మూడేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. మా పొలం తీసుకుని డబ్బులు ఇవ్వలేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై అధికారులు స్పందిస్తూ, విషయం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సీఎం చంద్రబాబు సమీక్ష





అమరావతి స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సీఎం సమీక్ష జరిపారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం... అనుమతుల్లో సులభతరం... అనవసరపు పర్మిషన్ల నియంత్రణపై చర్చ జరిగింది. కేంద్రం రూపొందించిన స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ప్రతిపాదనలను సీఎం ముందు ఉంచారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్ష జరిపారు.

800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపునకు తీసుకురావాలని సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్కు పరిమితం చేయాలని సీఎం సూచించారు. ? ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేసారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సీఎం సూచించారు.

ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలి. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్దతులను తప్పించాలి. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు.

పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వెల్లడించారు. తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి సీఎం వివరించారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడించారు.

# అమరావతిని అజరామరం చేశారు

**- ఐదుకోట్ల ఆంధ్రుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.**
**- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు.**
**- రైతుల త్యాగ ఫలితమే అమరావతి**
**- పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందన్న రాష్ట్రపతి**

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్రకు దేశ ప్రథమపౌరురాలు సాక్షి సంతకం కావడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అయిన రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన బిల్లుకు దేశమంతా ఒక్కటై మద్దతు ఇవ్వగా, రాజముద్ర వేసి అమరావతికి శాశ్వతత్వం కల్పిస్తూ శాసనం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆంధ్రులు జేజేలు పలుకుతున్నారు. మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-మా రాజధాని అమరావతి అని ఆంధ్రజాతి సగర్వంగా తల ఎత్తి చాటేలా చారిత్రక అమరావతి రాజధాని చట్టంపై సంతకం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు రాష్ట్రప్రతి భవన్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. విభజనతో కోలుకోని విధంగా ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని, రాజధాని లేని రాష్ట్రంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని గుర్తించి.. ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ చట్టం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముగారికి ఆంధ్రజాతి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరావతి చరిత్ర-సంస్కృతి-రాజధానిలో పూర్తయిన నిర్మాణాలు, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్ ప్రకారం మొత్తం నిర్మాణాలు పూర్తయితే అమరావతి రాజధాని ఎలా ఉంటుందో సూచించే ఊహాచిత్రాలు, పర్యావరణహిత నిర్మాణ విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని ఎంపీలతో కలిసి లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అమరావతి కి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీ, 2024 లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరావతి పనులు పునః ప్రారంభించింది ప్రధాని నరేంద్ర మోదీ అని రాష్ట్రపతికి వివరించారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీ సరస్వతి కాలేజీ విద్యార్థులు

ఇంటర్మీడియట్ ఫలితల్లో బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌లోని శ్రీ సరస్వతి జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ రామ సుబ్బయ్య రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో రేయాన్ బేగం 466 మార్కులతో రాష్ట్ర స్థాయిలో నాల్గవ ర్యాంకు, ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో సాయి అవంతిక 435 మార్కులతో నాల్గవ ర్యాంకు, సెకండర్ బైపీసీలో రోహిత్ 986 మార్కులు, ఎంపీసీ సెకండియర్‌లో అయేషా 980 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొత్తంగా ఫస్ట్ ఇయర్‌లో 93 శాతం, సెకండియర్‌లో అన్ని గ్రూపుల్లో కలిపి 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ సునీల్, వైస్ ప్రిన్సిపాల్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# బి.పి. మండల్ ఆశయాలను సాధిద్దాం: హుస్నాబాద్‌లో 44వ వర్ధంతి వేడుకలు

సిద్ధిపేట/?హుస్నాబాద్:ఏప్రిల్ 13 బీసీ రిజర్వేషన్ల ప్రదాత, మండల్ కమిషన్ రూపశిల్పి బి.పి. మండల్ 44వ వర్ధంతిని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ దండి లక్ష్మి మరియు వివిధ సంఘాల నాయకులు మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ దండి లక్ష్మి మాట్లాడుతూ బి.పి. మండల్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో అసెంబ్లీ మరియు పార్లమెంట్లలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగిల్ విండో మాజీ ఛైర్మన్ బోలిశెట్టి శివయ్య మాట్లాడుతూ చట్ట సభలలో బీసీలకు చోటు దక్కినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని, బీసీలు ఉన్నత చదువులు చదివి రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. జెఏసి నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ అభినవ అంబేద్కర్ అయిన బి.పి. మండల్ సూచించిన అన్ని సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

హుస్నాబాద్ పట్టణంలో జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే, జగ్జీవన్ రామ్ వంటి సామాజిక సంస్కర్తల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ?బీసీ సబ్ ప్లాన్ మరియు ప్రత్యేక మంత్రిత్వ శాఖకౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ కేంద్రంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బిఎస్పి ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రం బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వకపోతే రాజకీయంగా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మార్క అనిల్ గౌడ్ మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ?బీసీలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యతరాష్ట్ర నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు నామినేటెడ్ పదవులలో సరైన గుర్తింపు ఇవ్వాలని కోరారు. సామాజిక విశ్లేషకులు వడ్డేపల్లి మల్లేశం మాట్లాడుతూ బీహార్ ముఖ్యమంత్రిగా ఉంటూనే అవినీతిపై పోరాడిన గొప్ప వ్యక్తి మండల్ అని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో ముక్కెర సంపత్ కుమార్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, నాంపల్లి సమ్మయ్య, వేల్పుల రాజు, బొల్లంపల్లి ప్రసాద్, బుర్ర వెంకన్న, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

భైంసా రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని, నియోజకవర్గంలో అవసరమైనన్ని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలిపారు. గొల్లమాడ,తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు తమ గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని భైంసాలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,రైతుల పంటను పూర్తి స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభించామని,అవసరమైన చోట్ల మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సమస్యను సంబంధిత అధికారులకు,మంత్రికి ఇప్పటికే తెలియజేసినట్లు తెలిపారు.

# న్యాయవాది సుబ్బారావుకు పోలీసుల అల్కహాల్ టెస్ట్

హైదరాబాద్ సింగర్ మంగ్లీపై ఫిర్యాదు చేసిన న్యాయవాది పోలీస్ స్టేషన్కు తాగి వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. న్యాయవాది సుబ్బారావుకు ఆల్కహాల్ టెస్ట్ పంజాగుట్ట పోలీసులు నిర్వహించారు. టెస్టులో 27గా రీడింగ్ నమోదు అవ్వగా, మద్యం తాగి పోలీస్ స్టేషన్కు వచ్చినట్లు నిర్ధారించారు. రాత్రి తాగిన దానికి ఇప్పుడు టెస్ట్ చేయడం ఏంటని, కేసును పక్కదారి పట్టించేందుకే డైవర్షన్లు చేస్తున్నారని ఫిర్యాదుదారుడి ఆరోపణ.

# కుప్పంలో భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

కుప్పం లో భారీగా రేషన్ బియ్యం పట్టుపడింది. గుడిపల్లి మండలంలోని గుత్తార్లపల్లి సమీపంలోని ఓ ఇంట్లో భారీగా రేషన్ బియ్యం అక్రమ నిల్వ ను అధికారులు గుర్తించారు. టెంపోతో పాటు, సుమారు 4 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కుప్పం నుండి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. తమిళనాడు, ఆంధ్రాకు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించాం. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కుప్పం డిఎస్పీ పార్థసారథి హెచ్చరించారు.

# పాత వస్తువుల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

హన్మకొండలోని చైతన్య డిగ్రీ కళాశాల సమీపంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పాత ఇనుప సామాన్ ప్లాస్టిక్ స్టోరేజ్ భద్రపరిచే రూమ్ లో అగ్ని ప్రమాదం జరిగింది. భారీ ఎత్తున ఎగసిపడుతున్న మంటలను ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. అప్పటికే షాపు, చుట్టుపక్కల ప్రాంతాలు కాలి బూడిద అయ్యాయి. ..

# తిరుచానూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

తిరుపతి తిరుచానూరు పోలీసు స్టేషన్ ముందు సోమవారం నాడు ఉద్రిక్తత నెలకొంది. పద్మావతి అమ్మవారు ఆలయం వాహన బేరర్లపై దాడి కేసులో 19 మందిపై కేసు నమోదు చేసారు. అయితే, తమ వారిపై అక్రమంగా పోలీసులు కేసులు నమోదు చేశారంటూ మహిళలు నిరసనకు దిగారు. పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన వైనం. కేవలం రాజకీయ కక్షలతోనే తమవారిని వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్.. ఎస్పీ డౌన్ డౌను అంటూ నినాదాలు చేసారు. కక్షపూరితంగానే తమ వారిపై కేసులు నమోదు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే నాని ఆదేశాలతోనే అక్రమంగా అరెస్టులు అని ఆరోపించారు. ముందుగా దాడి చేసిన వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదంటూ పోలీసులను నిలదీసారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారినే అరెస్టు చేయడం

# పలు అభివృద్ధి పనుల ను ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



కడప ఖాజీపేట మండలం కొత్తపేట గ్రామంలో గ్రామీణాభివృద్ధికి ఊపిరి పోస్తూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. గ్రామ మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడే ఈ పనులు ప్రజల్లో కొత్త ఆశలను నింపాయి. ఈ సందర్భంగా ఉపాధిహామి నిధులతో సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన శ్మశానవాటికను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ ప్రజలకు అవసరమైన ముఖ్య సదుపాయాలలో శ్మశానవాటిక ఒకటని, ఇది అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు.

ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయని పేర్కొన్నారు. అలాగే ఉపాధిహామి నిధుల కింద మంజూరైన రూ.42 లక్షల విలువైన మెటల్ రోడ్డును కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రహదారి ద్వారా గ్రామానికి చేరుకోవడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. జయజయధ్వానాలతో, హర్షధ్వానాలతో గ్రామం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో మార్మోగింది. ప్రజల ప్రేమాభిమానాలు ఎమ్మెల్యే గారి పట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే గారు గ్రామ నాయకుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. గ్రామ స్థాయిలో నాయకత్వం బలంగా ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన ఎమ్మెల్యే , ప్రతి గ్రామంలో రోడ్లు, శ్మశానవాటికలు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే తన ధ్యేయమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు ఎమ్మెల్యేని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత, సర్పంచ్ గుర్రాల స్వతంత్ర

సైదాపూర్ సైదాపూర్ మండలంలోని ఆకునూరు గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆకునూరు గ్రామం సర్పంచ్ గుర్రాల స్వతంత్ర మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి అని మద్యం సేవించి వాహనాలు నడపకూడదు అని వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ పొల్యూషన్ వివిధ పత్రాలు ఉంచుకోవాలి అని రోడ్డు నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి అని హెల్మెట్ లేక వాహనాలు నడిపితే ఆక్సిడెంట్ అవుతుంది అని మద్యం సేవించి వాహనాలు నడిపిన ప్రాణాలు కోల్పోవడమే కాక మీ కుటుంబ సభ్యులను ఎక్కడ కానీ వారిని చేస్తారా అని ప్రజలకు తెలిపారు వాహనాలు నడిపేటప్పుడు మీ కుటుంబ సభ్యులు ఉన్నారు అని ఆలోచించి వాహనాలు నడపాలి అని అతివేగంగా వాహనాలు నడపకూడదు అని ప్రజలకు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామం సర్పంచ్ గుర్రాల స్వతంత్ర, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తాటి పెల్లి శ్రీనివాస్ రెడ్డి,హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, వార్డ్ సభ్యులు కొల్ల రాజిరెడ్డి, మామిడి సురేష్ నాగిరెడ్డి పెద్ద సంపత్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ రమ, అల్లి, పరశురాములు, ఏఎన్ఎం రాణి, ఇందిరా, శ్యామల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# చెరువు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం

**అయ్యమ్మ చెరువు పరిస్థితిపై ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం**

**పిసిబి, నీటి పారుదల శాఖల అధికారులపై ఫైర్**



పటాన్ చెరు ప్రజలకు ఉపాధి లభిస్తుందని పరిశ్రమల స్థాపనకు స్వాగతం పలికితే.. నేడు అవే పరిశ్రమలు ప్రజల ప్రాణాలు తీస్తూ.. ప్రతి రోజు కాలపూట విషాన్ని వెదజల్లుతున్నాయని, తీరు మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని చెట్ల పోతారం పరిధిలో గల అయ్యమ్మ చెరువు పరిస్థితిపై సోమ వారం ఉదయం మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి చెరువు కట్ట పైనే ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో కాలుష్య జలాలు కలవడం మూలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే జిఎంఆర్ కు తెలిపారు. ప్రతి రోజు ప్రత్యక్ష నరకం అనుభవించడంతోపాటు.. క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకి ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా తమ బతుకులు ఛిద్రమవుతున్నాయని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గడ్డపోతారం పరిధిలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉపాధి లభించడంతోపాటు ప్రజలు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారని పరిశ్రమల ఏర్పాటుకు అంగీకారం తెలిపితే.. నేడు అవే పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తూ స్థానిక చెరువులను తమ రసాయన జలాలతో కాలుష్యం చేస్తూ ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై వివిధ సందర్భాల్లో తీరు మార్చుకోవాలని పరిశ్రమల యాజమాన్యాలకు సైతం సూచించినప్పటికిని.. ఎలాంటి మార్పు కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. చెరువుల్లోకి కాలుష్య జలాలు వదలడం మూలంగా స్థానికంగా వ్యవసాయ రంగం పూర్తిగా విధ్వంసం కావడంతో పాటు పశుపక్షాదులు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయని తెలిపారు. మహిళలకు వివిధ రకాల క్యాన్సర్లు సోకి నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలను వదిలివేసి వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ప్రజల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని.. అవసరమైతే కాలుష్య పరిశ్రమలను తరిమి కొడతామని హెచ్చరించారు. కాలుష్యాన్ని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమల పై ప్రజలు నేరుగా ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మీ నిర్లక్ష్యం.. చేతగానితనం మూలంగానే పరిశ్రమలు విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని అన్నారు. అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. చెట్ల పోతారం నుండి కిష్టాయపల్లి, గండి చెరువు, కృష్ణారెడ్డిపేట చెరువు మీదుగా నక్క వాగు వరకు 6 ఫీట్ డయా పైపు లైన్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. చెరువు పరిధిలో కట్టుదిట్టమైన ఫెన్సింగ్ నిర్మాణం చేసి పశువులు వెళ్లకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. స్థానికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న 14 పరిశ్రమలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి అయ్యమ్మ చెరువులోని కాలుష్య జలాలను పూర్తిగా తొలగించ నున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాల కంటే విలువైనది ఏమీ లేదని.. ఇక నుండి పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలని.. కాలుష్య జలాలను వదిలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలు సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పిసిబి ఈఈ కుమార్ పాఠక్, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్,గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, సీఐ రవీందర్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, నరసింహ, ప్రకాష్ చారి, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగన్నాధపురం రహదారి వెడల్పు చేయడంలో జాప్యమేలా

**50 అడుగుల రోడ్డు 40 అడుగులకు ఎలా మారుతుంది ?**

**డిజైన్ మార్పు ఎమ్మెల్యేకు తెలుసా ?**

**అధికారుల సూచనలను వ్యాపారులు బేకాతరు చేస్తున్నారా!**

**అధికారులకు ముడుపులు అందడంతోనే**

**రహదారి డిజైన్ మారిందా ?**

భద్రాద్రి భద్రాద్రి జిల్లా పరిధిలోని ములకలపల్లి మండల పరిధిలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న జగన్నాధపురంలో జాతీయ రహదారి వెడల్పు తగ్గించాలన్న ఆలోచన వెనుక రహస్యమేమిటో అర్థం కాక జగన్నాధపురం ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఆర్ అండ్ బి, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారుల సూచనలను రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార వర్గాలు బేకాతరు చేస్తున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల 5వ తేదీన ఆర్ అండ్ బి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, పోలీస్ శాఖల అధికారులు వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం గ్రామం వద్ద 50 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే నెల 15 రోజులు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో పట్ల పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కిరువైపుల బడా వ్యాపారుల సముదాయాలు ఉండటం వల్లనే అధికారులు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆనాడు 50 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాల్సిందేనని ప్రజల సమక్షంలోనే ఆదేశాలు జారీ చేశారు.



అధికారులు ఇచ్చిన గడువు దాటిపోయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు తమ భవన సముదాయాలను నేటికి తగ్గించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగూడెం నుంచి భద్రాచలం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న దమ్మపేట క్రాస్ రోడ్డు నుండి అశ్వరావుపేట వద్ద గల మందలపల్లి జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. అయినా నెల 15 రోజులు అవుతున్నప్పటికీ వ్యాపారులకిచ్చిన గడువుదాటి పైన అధికారం నోరు మెదపకపోవడం ఏమిటని సర్వత్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పనులు నేటికీ ప్రారంభం కాకపోగా వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం లొ ఆనాడు 50 అడుగులు ఉండాల్సిందే అని స్పష్టం చేసిన అధికారులు, నేడు 40 అడుగులు వెడల్పు ఉంటే సరిపోతుందని అంటున్నట్లు తెలుస్తోంది. వ్యాపారు కూడలిగా ఉన్న ఆ గ్రామంలో ప్రధాన రహదారిని 10 అడుగులు తగ్గించినందుకు అధికారులకు పెద్ద ఎత్తున ముడుపు అందాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఎంతవరకు సమంజసమో అధికారులు ఎవ్వరికి వారు ప్రశ్నించుకోవాల్సి ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రోడ్డు వెడల్పు తగ్గించాలనే ప్రతిపాదన అశ్వరావుపేట ఎమ్మెల్యే దృష్టిలో ఉందా ? లేక సంబంధిత అధికారులకు ముడుపులు ఏమైనా అందాయ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు వెడల్పు 50 అడుగులా! 40 అడుగుల అన్న సమస్యను పక్కనపెట్టి పన్నులు ప్రారంభించాల్సిందేనంటున్న ఆ గ్రామ ప్రజలు. ఇప్పటికైనా పనులు ప్రారంభిస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# 12 ఏళ్లుగా హెల్మెట్ అలవాటు ఈ రాములు అందరికీ ఆదర్శం



మెదక్ నంద గోకుల్ గ్రామానికి చెందిన 80 ఏళ్ల రాములుగత 12 ఏళ్లుగా ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరిస్తూ గ్రామస్థులకు ప్రేరణగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అయనను సన్మానించి అభినందించారు. ప్రాణరక్షణలో హెల్మెట్ కీలకం ? ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుందామని అన్నారు.

# క్షేమంగా ఇంటికి రండి..మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తుంది

## -వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్,

వరంగల్ వాహనాలపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబందనలు పాటిస్తూ క్షేమంగా ఇంటి రావాలని..మీ రాక కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.



"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో రోడ్డు భద్రతతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకుగా నేటి నుండి ఈ నెల 18 తేది వరకు చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమములో భాగంగా ఎల్కతుర్తి మండలం చింతల్ పల్లి గ్రామంలో ఎల్కతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధి పాల్గొన్నారు. ఈ సందర్బంగా చింతల్ పల్లి గ్రామంలో ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించే



విధంగా వాహనదారులకు అవగాహన కల్పించి రీతిలో ఎర్పాటు చేసిన బైక్ ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనర్, సెంటర్ జోన్ డిసిపి ధార కవిత, స్థానిక పోలీస్ అధికారులు గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారులతో బైక్ ర్యాలీలో పాల్గోని గ్రామస్తులను ఉత్తేజపరిచారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయము ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు పోలీస్ కమిషనర్ పాల్గోని గ్రామస్తులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా నడపాల్సి వుంటుందని ముందుగా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపటంతో పాటు, సెల్ఫోన్లో మాట్లాడుతూ ప్రయాణించడం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, హెల్మెట్ ధరించి వాహనం నడపటం ద్వారా ప్రమాదాలకు గురైనప్పుడు ప్రమాద భారిన పడకుండా హెల్మెట్తో రక్షించబడుతారని, అలాగే యువత అతివేగంగా వాహనాలను నడిపి మృత్యువాత పడవద్దని రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఈ రోడ్డు ప్రమాదాలు ఎంతో మంది తల్లిదండ్రులకు కన్నీళ్ళకు కారణమవుతున్నాయని ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా వాహనంగా నడపటంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగివుండటంతో పాటు వాటిని అచరించాలని సిపి తెలియజేసారు. అనంతరం చింతల్ పల్లి గ్రామంలోని వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి రావాలని లేదంటే గ్రామంలో ప్రవేశం లేదని గ్రామ సభలో తీర్మానం చేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీలు చేసారు. ఈ కార్యక్రమములో కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, కాజీపేట్, హసన్పర్తి ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, చేరాలు, ఎల్కతుర్తి, ముల్కనూర్ ఎస్.ఐలు ప్రవీణ్ కుమార్, రాజు, గ్రామ సర్పంచ్ రజితా రవీందర్, మార్కెట్ చైర్మన్ సంతాజీతో ఇతర పోలీస్ అధికారులు, గ్రామస్తులు పాల్గోన్నారు.

# నూతన సుంకలమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజా...

## -గ్రామస్తుల సహకారంతోనే దేవాలయం నిర్మాణానికి శ్రీకారం



పతికొండ గ్రామంలో ఎన్నో ఏళ్ల నుండి ఉంటున్న సుంకులమ్మ ఆలయం పూర్తిగా పెక్కిలించడంతో నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు.సోమవారం పతికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో గ్రామస్తులు మరియు గ్రామ పెద్దల సహకారంతో సుంకులమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించడానికి భూమి పూజ చేశారు.దాదాపుగా 20 నుంచి 30 లక్షల దాకా ఖర్చు అయ్యే విధంగా ఉందని గ్రామ పెద్దలు అంచనా.. గ్రామస్తులు బత్తిన లక్ష్మీనారాయణ టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్,టిడిపి గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ లు చొరవ తీసుకొని గ్రామంలో పిల్ల తలలకు అమ్మవారి ఆశీస్సులు నిత్యం చల్లగా ఉండాలని పాతపడిన దేవాలయాన్ని నూతనంగా నిర్మించడానికి చొరవ చూపినందుకు,గ్రామస్తులు సంతోషించారు.బత్తిన బ్రదర్స్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు దేవాలయం నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు సహకరించాలని సూచించారు.అంతేకాకుండా అమ్మవారి ఆశీస్సులు గ్రామస్తులు దీవెనలు ఉన్నంతవరకు గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి,రఘు శేఖర్,బత్తిన హరి వర్ధన్,మల్లికార్జున,శీను,దశరథ,రామలింగప్ప,రామాంజనేయులు, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# పెద్దహుల్తి గ్రామంలో ఈరోజు "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం

పత్తికొండ పెద్దహుల్తి గ్రామంలో ఈరోజు "మీ భూమి ? మీ హక్కు" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజా ముద్ర గల పట్టాదారు పాస్‌బుక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ, గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతుల వ్యక్తిగత ఆస్తిపై, అంటే వారి భూముల పాస్‌బుక్కులపై అప్పటి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మలను ముద్రించడం సరికాదని పేర్కొన్నారు. "రైతు ఆస్తిపై మీ బొమ్మ ఎందుకు? రైతుకు సంబంధించిన హక్కుల పత్రం రాజకీయ ప్రచారానికి వేదిక కావడం తగదు" అని




విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతుల గౌరవాన్ని కాపాడే విధంగా రాజా ముద్రతో పట్టాదారు పాస్‌బుక్కులను అందజేస్తోందని తెలిపారు.ఇక రైతుల అభివృద్ధి కోసం సాగునీటి పరంగా కూడా కీలక చర్యలు అవసరమని ఈ సందర్భంగా ప్రస్తావించారు. హంద్రీ-నీవా కాలువ పరిధిలో హోసూరు గ్రామం మరియు బురుజుల గ్రామం ల వద్ద స్లూయిజ్ గేట్లు ఏర్పాటు చేసి, పెద్దహుల్తి మరియు చిన్నహుల్తి గ్రామాలకు వంకల ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచేలా చర్యలు తీసుకొంటాం ఈ చర్యలు అమలు చేస్తే ప్రాంతంలోని రైతులకు నీటి కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు."మీ భూమి ? మీ హక్కు" కార్యక్రమం రైతులకు న్యాయబద్ధమైన హక్కులు కల్పించడమే కాకుండా, భూవివాదాలను తగ్గించి రైతుల జీవితాల్లో స్థిరత్వాన్ని తీసుకువస్తుందని అన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు,అధికారులు, పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దు

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## ప్రజావాణికి 270 దరఖాస్తుల రాక

**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -- 13(ప్రజాబలం ప్రతినిధి)** ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 270 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా ప్రణాళిక అధికారి, సీ,డీ,ఈ సెక్షన్, తహసీల్ ఆఫీస్ రుద్రంగి, తహసీల్ ఆఫీస్ సిరిసిల్ల, అటవీ శాఖ, జిల్లా ఎక్సైజ్ అధికారి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఈఓ, ఆర్ అండ్ బీ, జీజీహెచ్ సిరిసిల్ల, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జిల్లా పశు సంవర్ధక అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, డీపీఆర్ఓ, జిల్లా వ్యవసాయ అధికారి, సహకార అధికారికి ఒకటి చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారి, నీటి పారుదల శాఖ, జిల్లా వైద్యాధికారి, తహసీల్ ఆఫీస్ చందుర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు 2 చొప్పున, జిల్లా విద్యాధికారి, తహసీల్ ఆఫీస్ వేములవాడ, బోయినపల్లికి 3 చొప్పున, ఉపాధి కల్పన అధికారి, తహసీల్ ఆఫీస్ గంభీరావుపేట, ఆర్డీఓ వేములవాడకు 4 చొప్పున, విద్యుత్ శాఖ, ఎస్పీ కార్యాలయం, తహసీల్ ఆఫీస్ ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ కు 5 చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, తహసీల్ ఆఫీస్ వేములవాడ రూరల్, కోనరావుపేట, ఆర్డీఓ సిరిసిల్లకు 6 చొప్పున, తహసీల్ ఆఫీస్ తంగళ్ళపల్లి, ఇల్లంతకుంటకు -7 చొప్పున, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు 8, జిల్లా పంచాయతీ అధికారికి 13, గృహ నిర్మాణ శాఖకు 68, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి 73 వచ్చాయి.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజయ్ సిటీ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు తో పలు విషయాలను చర్చించిన యువ నాయకుడు ధాత్రినాథ్ గౌడ్

**మియాపూర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఏప్రిల్ 13** ఆదివారం రోజు జరిగిన ప్రజయ్ సిటీ రెసిడెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో విజయం సాధించిన ప్రెసి డెంట్ నాగేశ్వర్ రావు,తన ప్యానెల్ సభ్యులు (వైస్ ప్రెసిడెంట్) రామకృష్ణ, (జనరల్ సెక్రటరీ) సంపత్,కృష్ణ,గౌతమ్, ఆకాష్ తదితరులు హఫీజ్ పేట్ యువ నాయకులు ధాత్రీనాథ్ గౌడ్ ఆఫీస్ కు వచ్చి మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధికి సంబందించిన భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా యువ నాయకులు దాత్రినాథ్ గౌడ్ మాట్లా డుతూ.... కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు తనకు ఎటువంటి సహాయాన్ని ఆశించిన తాను వెనకడుగువేసే ఛసక్తే లేదని తెలియ జేశారు.ఆదివారం రోజు జరిగిన ఎన్నికలలో విజయం సాధించిన నాగేశ్వ రావు ప్యానెల్ కు భవిష్యత్తు ప్రణాళిక ఎలా నడిపిద్దామని చర్చించుకోవడం జరిగిందని తెలిపారు. గెలిచిన ప్యానెల్ లోన్ సభ్యులంతా ఏకధాటిపై ఉంది కాలనీ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతైనా అవసరమని దాత్రినాథ్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# మర్పల్లి బాబాసాహెబ్ అంబేద్కర్ కి పూలమాల సమర్పించిన బిజెపి మండల అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి



**గర్భ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి బిజెపి మండల అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి పూలమాల సమర్పించి ధన్యవాదాలు తెలిపారు ఎంతటి గొప్ప మహానీయుడు జ్ఞాన సంపన్నుడు వెలిగే సూర్యుడు ప్రపంచ జ్ఞాని ప్రపంచ దేశాల్లో తనకంటూ ఒక జ్ఞాన శైలి సంపాదించిన గొప్ప వ్యక్తి మన బాబాసాహెబ్ అంబేద్కర్ అని బిజెపి మండల అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి స్నేహితులతో కలిసి పూలమాల సమర్పించినట్లు తెలిపారు

# అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందించిన మాజీ కార్పొరేషన్ చైర్మన్ బిక్షపతి





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా,:** పుల్కల్ మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు, అగ్ని ప్రమాదంలో రెండిల్లు పూర్తిగా దగ్ధమై, నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి, పుల్కల్ లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో, ఆవుసలి లక్ష్మణ్ చారి,అవుసలి పాండురంగం, వీరికి సంబంధించిన, రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి, ఈ ఘటనపై సమాచారం అందుకున్న, వెంటనే తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బిక్షపతి, స్పందించారు, ప్రమాద బాధితులను స్వయంగా పరామర్శించి, వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు, ప్రమాద స్థలాన్ని పరిశీలించిన బిక్షపతి, అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇరు బాధిత కుటుంబాలకు, ఆయన తక్షణ సహాయం అందించారు, మళ్లీ సాధారణ జీవితం గడిపేందుకు, అవసరమైన ఆర్థిక సహాయంతో పాటు, నిత్యవసర సరుకులు బియ్యం, వంటనూనె, పప్పు ధాన్యాలతో కూడిన కిట్లను, స్వయంగా పంపిణీ చేసి, వారి ఆకలి తీర్చే ప్రయత్నం చేశారు, ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం మన బాధ్యతని, ప్రమాదంలో నివాసాలను కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఆవేదన వ్యక్తం చేశారు, ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి, ఈ పేద కుటుంబాలకు, నష్టపరిహారం అందించి, పక్క గృహాలు మంజూరు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు, ఆపద సమయంలో తమ వద్దకు వచ్చి, ఆర్థికంగా మానసికంగా ధైర్యం కల్పించిన, బిక్షపతి, కి బాధిత కుటుంబ సభ్యులు, కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు




**ప్రజాబలం దినపత్రిక వేములవాడ ఏప్రిల్ -13** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వేములవాడ మండలం అనుపురం గ్రామంలో సోమవారం రోజున అనుపురం గ్రామంలో గ్రామ సభలో టౌన్ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ గ్రామస్తులకు రోడ్డు భద్రతపై దిశా నిర్దేశం తోపాటు రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామంలో ట్రాఫిక్ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు అధికారుల సమక్షంలో ఇటీవల జరిగిన కొన్ని రోడ్డు ప్రమాద ఉదాంతాలను ఉదాహరణగా వివరిస్తూ హెల్మెట్ ధరించడంపై, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రజలను చైతన్య పరిచారు. అలాగే భద్రత ప్రతిజ్ఞ గ్రామస్తులు అందరితో కలిసి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ ఐ,ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు , పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# మండల ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



**కూసుమంచి ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజాబలం)** కూసుమంచి మండల కేంద్రంలో కూసుమంచి మండల ఎమ్మార్వో గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డి సైదులు గారిని మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేస్తూ, సన్మానం చేయడం జరిగినది. ఈ సందర్భంగా కూసుమంచి మండల ప్రజలు, ముఖ్యంగా రైతులు చాలా మంచి వారు, అమాయకులు అని వారు వివిధ పనులు నిమిత్తం కార్యాలయము వద్దకు వచ్చినప్పుడు హెల్ప్ డెస్క్ ద్వారా వారి సమస్యలు కనుగొని సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ చూపాలని ఎమ్మార్వో గారిని కోరడం జరిగింది.

తక్షణం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయండి

అదేవిధంగా మండల కేంద్రంలో ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ప్రైవేటు వ్యాపారుల ను ఆశ్రయించడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కావున సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తక్షణం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలి అని విజ్ఞప్తి చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పిట్టల వేణు గుండా విజయ్ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# మర్పల్లి పరిధిలోని వివిధ గ్రామాలో శుభకార్యాలకు పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్,



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 13 ( ప్రజాబలం) వికారాబాద్జిల్లా:**మర్పల్లిమండలం షావ్రార్,బిఆర్ఎన్,పార్టీనాయంకులం .వెంకటయ్యకుమారుడి వివాహం ఇటీవల జరగగా మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేసిన వికారాబాద్ జిల్లా , బి ఆర్ ఎస్,పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అనంతరం జెంషెడ్ పూర్ గ్రామ ఉప సర్పంచ్, బి ఆర్ ఎస్,పార్టీ నాయంకులంవ్రభుంయాదవ్,సోదరుండు వెంకటేష్,వివాహం జరగగా వారి ఇంటికి వెళ్లి కలిసి శుభాకాంక్షలు తెలియసారు కార్యక్రమంలో మర్పల్లి నాయకులు మర్పల్లి మండల పార్టీ అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పట్లూర్,మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ , వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ వైస్ ఎంపీపీలు, మర్పల్లి మండల రైతు సమన్వయ మండల మాజీ అధ్యక్షులు నాయబ్ గౌడ్ , మండల యూత్ అధ్యక్షులు మధు, ఘనపూర్ సంతోష్, వివిధ గ్రామాల పెద్దలు సీనియర్ నాయకులు బి ఆర్ ఎస్ కుటుంబ సభ్యులు పలు శుభకార్యాల్లో డాక్టర్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, తో కలిసి పాల్గొన్నట్టు తెలిపారు



# భీమేశ్వరఆలయంలో భక్తులరద్ది



**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ ఏప్రిల్ -13** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వర ఆలయంలో సోమవారం రోజున భక్తుల రద్దీ నెలకొంది వేసవికాలం కావడంతో విద్యార్థుల పరీక్షలు ముగిస్తున్న తరుణంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంటల తరబడి క్యూ లైన్ లో నిలబడి కోడె ముక్కు చెల్లించుకొని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలవకుండా త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించారు.

# యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా ఏప్రిల్ 13:**ప్రజాపాలన--పురోగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం కలెక్టర్ స్వయంగా యోగాసనాలు చేసి పాల్గొన్న వారిలో ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,యోగ మన భారతీయ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగమని, ఇది వేల సంవత్సరాల చరిత్ర కలిగిన జీవన విధానమని తెలిపారు. నేడు యోగ ప్రపంచవ్యాప్తంగా విస్తరించి,అన్ని దేశాల్లో ప్రజలు దీనిని ఆచరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు.యోగ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా,మనసు,ఆలోచనలు, జీవనశైలిని సానుకూల దిశగా మలిచే శక్తివంతమైన సాధనమని కలెక్టర్ అన్నారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళనలు తగ్గి,శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత లభిస్తాయని వివరించారు.ప్రస్తుత కాలంలో ఉద్యోగులు దైనందిన జీవితంలో పని ఒత్తిడితో ఆరోగ్యం పట్ల సరైన శ్రద్ధ వహించకపోవడం వల్ల వివిధ వ్యాధులు దరిచేరుతున్నాయని తెలిపారు.అలాంటి పరిస్థితుల్లో ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక సమతుల్యత పెంపొందడంతో పాటు వ్యాధులను దూరం చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రపంచ వ్యాప్తంగా యోగకు పెరుగుతున్న ఆదరణ మన సంస్కృతికి గర్వకారణమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ యోగను తమ దైనందిన జీవితంలో భాగంగా అవలంబించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యోగ గురువు రవీంద్ర చారి,జిల్లా పర్యాటక శాఖాధికారి శివాజీ,జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు,జిల్లా పౌరసంబంధాల అధికారి ఆయూబ్ అలీ,డీఈ అరుణ,జిల్లా సహకార అధికారి, సంజీవరెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్,తదితర శాఖల అధికారులు,సిబ్బంది యోగాభ్యాసకులు పాల్గొన్నారు.





# సురక్షిత ప్రయాణమే అందరికీ శ్రేయస్కరం

## -- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా ఏప్రిల్ 13:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని హనుమకొండ,వరంగల్, జనగామ జిల్లాల పరిధిలోని ప్రజలకు సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాలోజి కళాక్షేత్రంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి,వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ,సురక్షిత ప్రయాణమే అందరికీ శ్రేయస్కరమని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఎంతో ప్రభావవంతంగా ఉన్నాయని అభినందించారు.నిర్లక్ష్యం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని,రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాణాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని,విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా నిర్లక్ష్యం,అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లనే జరుగుతున్నాయని చెప్పారు. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు కమిషనరేట్ పరిధిలో గ్రామ సభలు,"నో హెల్మెట్ -- నో వెహికల్ ఎంట్రీ" అమలు,సినిమా థియేటర్లలో షార్ట్ ఫిల్మ్స్ ప్రదర్శన, ప్రత్యేక అవగాహన వాహనాల ద్వారా ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, నిద్రలేమితో వాహనం నడపవద్దని, ప్రతి ఒక్కరూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడే బాధ్యతతో డ్రైవింగ్ చేయాలని పిలుపునిచ్చారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ,జిల్లాలో రోడ్డు భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి నెల సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో "నో హెల్మెట్ -- నో ఎంట్రీ" అమలు మంచి పరిణామమని,దీనిని విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. ఇంటింటా సర్వే ద్వారా ద్విచక్ర వాహనదారులందరికీ హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నారు.రోడ్డు భద్రత మన చేతుల్లోనే ఉందని, ఒక ప్రమాదం జీవితాన్ని పూర్తిగా మార్చివేస్తుందని హెచ్చరించారు.వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ,వేగంగా ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ముందస్తుగా ప్రణాళిక చేసుకుని ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మేలని పేర్కొన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, గ్రామసభల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు.కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా సురక్షిత ప్రయాణంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించి, లైసెన్స్, వాహన పత్రాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.కార్యక్రమంలో రోడ్డు భద్రతపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ రూపొందించిన "వేగం కన్నా ప్రాణం మిన్న" వీడియో గీతం ప్రదర్శించగా, ప్రమాదాల తీవ్రతను కళ్లకు కట్టినట్లు చూపించి అందరినీ ఆలోచింపజేసింది.కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఫ్లాష్ మాబ్, స్కిట్స్,పోలీసుల కళాజాతా, తెలంగాణ సాంస్కృతిక సారథి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెల్మెట్ లేకుండా, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులు చేసిన నాటికలు చైతన్యం కలిగించాయి. పోలీసులు, యువత కలిసి ప్రదర్శించిన అవగాహన కార్యక్రమాలు రోడ్డు భద్రతపై కనువిప్పు కలిగించాయి.అనంతరం దీర్ఘకాలంగా ఎలాంటి ప్రమాదాలు లేకుండా సురక్షితంగా డ్రైవింగ్ నిర్వహించిన ఉద్యోగులను, ట్రాఫిక్‌లో ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందినిఅరైవ్ అలైవ్ చాంపియన్లుగా ఘనంగా శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు అంతకుముందు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో కాలోజి కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లలో రోడ్డు భద్రతపై ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఎమ్మెల్సీ, పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్లు సందర్శించి తిలకించారు.ఈ కార్యక్రమంలో డిసిపి లు ధార కవిత, అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, రవి, అదనపు డిసిపి ప్రభాకరరావు, పోలీస్, రవాణా, రెవెన్యూ శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భావసంగ్ మహారాజ్ మరియు మ్యారామా భవాని పేర్లని విస్మరిస్తూ దుశ్చర్యలు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలి

**మాకుల జాతర మజ్జిదేవేర్ జాతర – మజీర్ హాట్ పోస్టర్లు ఆవిష్కరణ**

**మాకుల (లంబాడీ కుల) గోర్ మాటీల ఆత్మ గౌరవ సదస్సు ను జయప్రదం చేయండి**

**భావసంగ్ బావా పేరును అలాగే మ్యారమా భవానీ పేరును ఉన్న పేర్లతో కొనసాగించాలి**




**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజాబలం)** ఖమ్మం నగరంలో స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త జాదవ్ రమేష్ నాయక్ మాట్లాడుతూ భావసంగ్ మహారాజ్ మరియు మ్యారామా భవాని పేర్లని విస్మరిస్తూ మరిపెడ మండల మాకుల తండా మాకుల దేవాలయ దేవాదాయ శాఖ అధికారులు చేసిన దుశ్చర్యలను ఖండిస్తూ మాకుల జాతర మజ్జిదేవేర్ జాతర – మజీర్ హాట్ అనే



పేరుతో ముద్రించబడ్డ పోస్టర్లను ఆవిష్కరించారు . 15-04-2026 బుధవారం ఉ 10.30 నిమిషములు నుండి 11:59 నిమిషములకు వరకు జాతి గురువులచే సాతి భవాని , 6 గురు జాతి గురువుల భోగ్ (ధప్కార్) మాకుల (లంబాడీ కుల) గోర్ మాటీల ఆత్మ గౌరవ సదస్సు ను నిర్వహిస్తున్నామని కావున బాడీ బంజారా గోరోమాటీ (విద్యార్థి, ఉద్యోగ, ప్రజా, రాజకీయ బావోజి) సంఘాలు భాగస్వామ్యంతో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు మాకులా దేవాలయ నిర్మాణ మరియు భూమి దాతల మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే సురేందర్ రెడ్డి చెప్పిన విధముగా పోయిన సంవత్సరం ఏప్రిల్ 9వ తారీకున మ్యారమా భవానీ విగ్రహ ప్రతిష్ట ఆయన చేతుల మీదుగా చేయడం జరిగింది . కానీ ఇప్పటి వరకు గుడి మీద ఎలాంటి శిలాఫలకం కూడా లేకపోవడం శోచనీయం అని అన్నారు బ్రహ్మోత్సవాల సందర్భముగా మాకుల తండా మాకుల దేవాలయ దేవాదాయ శాఖ అధికారులు చేసిన దుశ్చర్యలను పరిగణంలోకి తీసుకుని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు ప్రతి ఆదివారం మరియు జాతర సందర్భముగా వేలాది మంది లంబాడీ భక్తులు భావసంగ్ బావను దర్శించుకొని మొక్కులు చెల్లించి భోగ్ భండార్ కార్యక్రమం చేస్తారు అలాగే పక్కనే ఉన్న మ్యారామ భవానికి యేట పోతులను కోసి మొక్కులు చెల్లిస్తారు ఇక్కడ కేవలం భావసంగ్ బావా కోసం మ్యారమా భవాని కోసం మాత్రమే లంబాడీలు వస్తారు కనుక వారి మనోభావాలు దెబ్బ తీయకుండా అలాగే ఇతర కులాల భక్తుల మనోభావాలు కించపరచకుండా భావసంగ్ బావా పేరు ను అలాగే మ్యారమా భవానీ పేరును ఉన్న పేర్లతో పాటుగా కొనసాగించాలని పత్రిక ముఖంగా అభ్యర్థించారు ఈ కార్యక్రమం లో లైవ్ అడ్వకేట్ విభాగ రాష్ట్ర కార్య దర్శి భూక్యా హరి నాయక్ బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర నాయకులు బానోతు లింగా నాయక్ లైవ్ భద్రాద్రి జోనల్ కోఆర్డినేటర్ జాదవ్ మంగీలాల్ , జిల్లా అడ్వకేట్ విభాగ సెక్రటరీ మణి మాల , బ్లూ



ఇండియా పార్టీ జిల్లా నాయకులు హరి నాయక్ , లైవ్ డోర్నకల్ నియోజక వర్గ అధ్యక్షులు ప్రవీణ్ నాయక్ , పాలేరు నియోజక వర్గ అధ్యక్షులు శోభన్ నాయక్ , సేవాలాల్ సేన నియోజక వర్గ ఇంచార్జి నరేష్ నాయక్ , లైవ్ బావోజీల సంఘ రాష్ట్ర నాయకులు బానోతు సీతారామ్ నాయక్ , లైవ్ మరిపెడ మండల అధ్యక్షులు దేవేందర్ నాయక్ లు పాల్గొన్నారు

# దార్లపల్లి ,రోడ్డు రవాణా భద్రత గురించి గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజ్ ఆధ్వర్యంలో గ్రామసభ





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల పరిధిలోని దార్లపల్లి గ్రామపంచాయతీ భవనంలో రోడ్డు భద్రత గురించి గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ తల రి దుర్గమ్మ బాలరాజ్ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించడం జరిగిందని తెలిపారు గ్రామ సభలో సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజ్ మాట్లాడుతూ ప్రజలు సుఖ ప్రయాణం చేయాలి టు వీలర్ ఉన్నవారు ప్రయాణంలో హెల్మెట్ తప్పక ధరించాలి ఫోర్ వీలర్ ఉన్నవారు ప్రయాణంలో సీట్ బెల్టు ధరించుకోవాలి రోడ్డు ప్రయాణంలో ఉన్నప్పుడు మద్యం సేవించకూడదు ట్రాఫిక్ రూల్స్ ని అధిగమించి అతి వేగంగా వాహనాలు నడపకూడదు సుఖ ప్రయాణం చేద్దాం కుటుంబంతో కలిసి హ్యాపీగా జీవిద్దాం అనిగ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్రాజ్, ఉప సర్పంచ్, వార్డు, అంగన్వాడి టీచర్స్, మహిళా సంఘాల అధ్యక్షులు, గ్రామ సెక్రెటరీ, గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు

# టౌన్ లీడర్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 13 ములుగు** ములుగు లో పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ములుగు మున్సిపాలిటీల పరిధిలోని మహిళా సమైక్య సమావేశం సోమవారం ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో ఏడిఎంసి, వహిదా,ఆధ్వర్యంలో జరిగింది

ఈ సమావేశంలో, టౌన్ లీడర్ ఫెడరేషన్ కు శ్రీ మొక్ష పేరు ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని సమైక్య సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు అధ్యక్షురాలుగా బండారి రజిత,ఉపాధ్యక్షుడిగా అమీనా సుల్తాన్, కార్యదర్శిగా జరీనా, కోశాధికారిగా సుంకరి హైమావతి, సహాయ కార్యదర్శిగా దాసు రాజేశ్వరి, లను ఎన్నుకున్నారు , ఈ కార్యక్రమంలో, మహిళా సమైక్యల అధ్యక్షురాలు ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రత అందరి బాధ్యత..!

## - జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 13 (ప్రజాబలం ప్రతినిధి)-** వాహనదారులతో ప్రతిజ్ఞ..రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ఆఫీసులో సోమవారం ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. వాహనదారులందరూ భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, నిదానంగా ప్రయాణించడం, రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు. ప్రమాద రహిత సమాజం కోసం కృషి చేయాలని లక్ష్మణ్ కోరారు. ప్రాణాలు అమూల్యమైనవని, ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆఫీసుకు వచ్చిన వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం వి ఐ పృథ్వీరాజ్ వర్మ, రవాణా శాఖ సిబ్బంది కల్పన, రమ్య, సౌమ్య పాల్గొన్నారు.

# సాయిని నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





**ప్రజాబలం ప్రతినిధి( వేములవాడ 13-ఏప్రిల్)** వేములవాడ విలీన గ్రామమైన కొనాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సాయిని నర్సయ్య సోమవారం రోజున గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్ నీలమ్మ, సీనియర్ నాయకులు సంఘ స్వామి యాదవ్, బింగి మహేష్, సాయిని అంజయ్య రాజేశం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

## గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 33 ఫిర్యాదులు స్వీకరణ

## జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్-13 (ప్రజాబలం ప్రతినిధి)** సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 33 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..



ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు

# ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి.

## జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి.





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 13 కలెక్టరేట్ ములుగు**జన గణనలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఇండ్ల గణన కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11వ తేదీ నుండి నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఇండ్ల జాబితా బ్లాక్ లను రూపొందించాలని, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఇండ్ల గణన, జనగణన జాబితా ప్రకారం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో దోహదపడతాయని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని తెలిపారు. జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల సమన్వయంతో ఇండ్ల గణన ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు నియమించబడిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

## అవసరమైన చోట రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం

## హాజరైన ఎస్పీ, వివిధ శాఖల అధికారులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -- 13 ( ప్రజాబలం ప్రతినిధి)**రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పీఆర్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్, వైద్య, ఎక్సైజు, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ కమిటీ ఛైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా గతనెలలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సందర్భంగా చర్చించిన అంశాలపై సమీక్ష



చేశారు. రవాణా, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పోలీస్ శాఖ సంయుక్తంగా చేసిన సర్వే వివరాలపై ఆరా తీశారు. రవాణా శాఖ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.జిల్లాలో ఇప్పటి దాకా జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ గుర్తించారు? ఎన్ని పూర్తి చేశారో ఆరా తీశారు. జిల్లాలో మొత్తం 21 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, 13 పనులు పూర్తి అయ్యాయని, మిగతా పనులు చేసేందుకు పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు.వేములవాడ నుంచి కరీంనగర్ రోడ్డులో అవసరమైన సైన్ బోర్డ్ పెట్టాలని, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిద్దిపేట సిరిసిల్ల రోడ్డులో రోడ్డు పైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని, సిరిసిల్లలో వీధి దీపాలకు మరమ్మత్తు చేయించాలని ఆదేశించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో అరైవ్.. అలైవ్ లో భాగంగా ఈ నెల 15 వ స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని పాఠశాలల ముందు సైన్ బోర్డ్ పెట్టాలని, రోడ్ క్రాసింగ్, సైకిల్ సేఫ్టీ డ్రైవింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ఇతర అంశాలపై విద్యార్థులతో వారి తల్లితండ్రులకు లేఖ రాయించాలని తెలిపారు. ఈ నెల 16 వ తేదీన మండల సభ నిర్వహించాలని ఆదేశించారు ఈ నెల 17వ తేదీన ఆర్ టీ సీ డ్రైవర్లు, కండక్టర్లు, ప్రైవేట్ స్కూల్ బస్, ఆటో, మున్సిపల్ శానిటేషన్ వాహనాల డ్రైవర్లకు గోల్డెన్ హవర్, సీపీఆర్ పై ట్రైనింగ్ ఇవ్వాలని, అందరికీ కంటి పరీక్షలు చేయాలని సూచించారు. అలాగే వాహనాల తనిఖీ చేయాలని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సదుపాయం, క్షతగాత్రులను హాస్పిటల్ కు తరలించి ప్రాణాలు కాపాడే వారికి రహవీర్ అర్థిక సహాయం, క్యాష్ లెస్ వైద్యంపై సమీక్ష చేశారు.

అరైవ్.. అలైవ్ అమలు

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్.. అలైవ్ కింద జిల్లాలో వివిధ కార్యక్రమాలు అమలు చేస్తామని ఎస్పీ మహేష్ బీ గీతే తెలిపారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత నియమాలు పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.సమావేశంలో నేషనల్ హైవే ఈఈ సురేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీటీఓ లక్ష్మణ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్పుద్దిన్, జీజీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, వేములవాడ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -13: (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి సమీక్షించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.గత మూడు నెలల్లో ఔట్ పేషెంట్ లు 60,579 మంది, ఇన్ పేషెంట్ 3,939 మంది నమోదు అయ్యారని వైద్యులు తెలిపారు. జనవరి నుంచి మేజర్ ఆపరేషన్లు 365, మైనర్ ఆపరేషన్లు 993 చేశామని వెల్లడించారు. స్త్రీ ప్రసూతి విభాగం లో సిజేరియన్ల సంఖ్య 416, సాధారణ ప్రసవాల సంఖ్య 111 అయ్యాయని తెలిపారు. ఆసుపత్రిలో నెలకు సగటున 3,700 ఎక్స్ రేలు, 2,200 కి పైగా యూ ఎస్ జీ స్కానింగ్ లు చేశామని వివరించారు. మూడు నెలల్లో కలిపి మొత్తం 1,844 స్కాన్లు తీశామని తెలిపారు. ఆరోగ్య శ్రీ లో భాగంగా జనవరి నుంచి మార్చి వరకు మొత్తం 1,012 ఓపీ కేసులు, 838 ఇన్ పేషెంట్ కేసులు నమోదయ్యాయని, జనవరి నుంచి మార్చి వరకు 59 కుటుంబ నియంత్రణ కేసులు చేశామని వెల్లడించారు.సమావేశంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఆర్ ఎం ఓ డాక్టర్ సంతోష్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.



# నేడు మంగళవారం రాయని గూడెం, సర్వాపురం, రేపు రాజుపేట, మల్లూరు గ్రామాల్లో 'ప్రజా దర్బార్' కార్యక్రమం. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 13. మంగపేట**ములుగు మండలం రాయని గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు, సర్వాపురం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ సాయంత్రం 6 గంటలకు, మంగపేట మండలం రాజుపేట గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ లో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు, మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యం లో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో ములుగు మండలంలోని రాయినిగూడెం సర్వపూర్, మంగపేట మండలం రాజుపేట మల్లూరు గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, నాలుగు గ్రామాలకు చెందిన ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్ పి, డి ఎఫ్ ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖ ల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధత మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com